# మన జనప్రగతి

తెలుగు దినపత్రిక

నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం

సంపుటి : 6 | సంచిక : 149 | పేజీలు : 8 | వెల : రూ.2/- గురువారం 25 జూన్ 2026 | వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


# అవనిగడ్డలో లోకేశ్ పర్యటన

**ఘనంగా స్వాగతించిన స్థానిక నేతలు**

**మోపిదేవిలో ప్రత్యేక పూజలు**

**కొక్కిలిగడ్డ జడ్పీ పాఠశాల నేతన భవనానికి ప్రారంభం**




**మచిలీపట్టణం,మన జనప్రగతి జూన్ 24:**అవనిగడ్డలో మంత్రి నారా లోకేశ్ పర్యటించారు. కొక్కిలిగడ్డ నుంచి మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్న మంత్రి.. అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి చేరుకునే ముందు గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించారు. 'బాగున్నారా' అంటూ కరచాలనం చేశారు. 'లోకేశ్ అన్నా' అంటూ ప్రేమతో మంత్రిని స్థానిక ప్రజానీకం పలకరించింది.అనంతరం, వేద ఆశీర్వచనాలతో లోకేశ్‌కు దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి.. స్వామివారి పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ఫొటో, లడ్డూ ప్రసాదాన్ని అందించి లోకేశ్‌ను అధికారులు సత్కరించారు. లోకేశ్ వెంట ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, బోడే ప్రసాద్, వెనిగండ్ల రాము, కాగిత దర్శించుకున్నారు. అనంతరం మోపిదేవిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో

మిగతా2లో...

# ఏపీలో సువర్ణ అధ్యాయం

## జొన్నగిరి గోల్డ్ మైన్స్ ప్రారంభంలో సీఎం చంద్రబాబు






**రాయలసీమ రతనాలసీమగా మారబోతోంది**

**జొన్నగిరి గోల్డ్ మైన్‌తో ఇక్కడి ప్రజల జీవితాలు మారుతాయి**

**భవిష్యత్‌లో దేశమంతా జొన్నగిరి గురించే మాట్లాడుతుంది**

**శరవేగంగా సీమ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం**

**గొడ్డలి పార్టీ రాజకీయాలతో అప్రమత్తంగా ఉండాలి**

**కర్నూలు,మన జనప్రగతి జూన్ 24:**ఏపీలో సువర్ణ అధ్యాయం మొదలైందని.. రాయలసీమ రతనాల సీమగా మారబోతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. బుధవారం జొన్నగిరిలో గోల్డ్ మైన్స్ ప్లాంట్‌ను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ.. జొన్నగిరి గోల్డ్ మైన్‌తో ఇక్కడి ప్రజల జీవితాలు మారుతాయన్నారు.

మిగతా2లో...

# సీఎం రేవంత్ రెడ్డికి హైకోర్టులో ఊరట...

**ఒకేసారి ఐదు కేసుల కొట్టివేత**

**2019 నాటి కేసుల నుంచి రేవంత్ రెడ్డికి విముక్తి**

**ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసుల్లో క్లీన్ చిట్**



**హైదరాబాద్, మన జనప్రగతి జూన్ 24:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైకోర్టులో భారీ ఊరట లభించింది. 2019 హుజూర్‌నగర్ అసెంబ్లీ ఉప ఎన్నికల ప్రచార సమయంలో ఆయనపై నమోదైన ఐదు కేసులను తెలంగాణ ఉన్నత న్యాయస్థానం బుధవారం కొట్టివేసింది. ఈ కేసుల నుంచి తనను విముక్తుడిని చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి దాఖలు చేసిన ఐదు వేర్వేరు పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ మేరకు తుది తీర్పును వెలువరించింది. 2లో...

# మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్న డిప్యూటీ సీఎం పవన్

**అమరావతి,మన జనప్రగతి జూన్ 24:**మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ బుధవారం ఉదయం దర్శించుకున్నారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి, అష్టోత్తరాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొండ ఎగువన మిగతా2లో...



# కెసిఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారు

**రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు**

**కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆగమైన రాష్ట్రం**

**జిల్లా ప్రాజెక్టులపై మంత్రుల నిర్లక్ష్యం**

**సత్తుపల్లి పర్యటనలో కెటిఆర్**




**ఖమ్మం,మన జనప్రగతి జూన్ 24:** రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని.. రెన్యువల్ సీఎం అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు సెటైర్లు వేశారు. కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ గెలిస్తే రాష్ట్రం ఆగమవుతుందని కేసీఆర్ అనాడే చెప్పారని అన్నారు. బీఆర్ఎస్ ఓటమితో రాష్ట్రం నష్టపోయిందని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి 72సార్లు ఢిల్లీ వెళ్లి ఏం సాధించారని ప్రశ్నించారు. బుధవారం సత్తుపల్లిలో కేటీఆర్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.**మిగతాది** 2లో...

# తెలంగాణ కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు..!

**కేంద్ర సర్వీసుల నుంచి సొంత కేడర్‌కు వచ్చిన సీనియర్ ఐఏఎస్**

**ఈ నెల 30న ప్రస్తుత సీఎస్ కె. రామకృష్ణారావు పదవీ విరమణ**

**కేంద్రంతో సమన్వయం కోసమే రేవంత్ రెడ్డి వ్యూహాత్మక ఎంపిక**

**హైదరాబాద్, మన జనప్రగతి జూన్ 24:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి (చీఫ్ సెక్రటరీ)గా సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు నియామకం దాదాపు ఖరారైంది. ప్రస్తుతం కేంద్ర సర్వీసుల్లో ఉన్న ఆయనను తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థన మేరకు కేంద్రం రిలీవ్ చేసింది. ప్రస్తుత సీఎస్ కె. రామకృష్ణారావు పదవీ కాలం జూన్ 30తో **మిగతాది** 2లో...




# నేడు తుంగభద్ర ప్రాజెక్టు కొత్త స్పిల్‌వే గేట్ల ప్రారంభోత్సవం

**నేడు ఒకే వేదికపైకి ఏపీ, తెలంగాణ, కర్ణాటక సీఎంలు**

**రూ. 51 కోట్ల వ్యయంతో ఆరు నెలల్లో గేట్ల నిర్మాణం పూర్తి**

**2024 వరదల్లో గేటు కొట్టుకుపోవడంతో పటిష్ఠ చర్యలు**

**హోస్పేటలో జరగనున్న బహిరంగ సభలో పాల్గొననున్న నేతలు**



2లో.




# త్వరలో బీసీ రక్షణ చట్టం

**- బిసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**

**అమరావతి,మన జనప్రగతి జూన్ 24:**ఆంధ్రప్రదేశ్ బీసీల ఆత్మగౌరవం, రక్షణ, సామాజిక న్యాయం కోసం "బీసీ రక్షణ చట్టం–2026" చట్టం తీసుకొస్తున్నట్లు బిసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత చెప్పారు. కూటమి ప్రభుత్వం గడచిన రెండేళ్లలో శాఖాపరంగా చేపట్టిన ప్రగతిని సచివాలయంలో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఇటువంటి చట్టం తీసుకురావడం దేశంలోనే మొట్టమొదటిసారన్న మంత్రిఈ చట్టంతో 138 బీసీ కులాలకు రక్షణ లభిస్తుందని అన్నారు. ఇప్పటికే బీసీ రక్షణ చట్టం తుది ముసాయిదా సిద్ధమైనట్లు పేర్కొన్నారు. బీసీ రక్షణ చట్టం కోసం బీసీ మంత్రులు ఇప్పటికే మూడు పర్యాయాలు

మిగతా2లో...

# సాయికృష్ణది లాకప్ డెత్

**సిట్ నిర్ధారణ.. విజయవాడ కోర్టుకు రిమాండ్ రిపోర్ట్ సమర్పణ**

**సీసీటీవీ ఫుటేజ్ డిలీట్, మృతదేహం మాయం చేశారని వెల్లడి**

**కృష్ణా లంక సీఐ నాగార్జునకు 14 రోజుల రిమాండ్**


**దర్యాప్తునకు సీఐ సహకరించడం లేదని సిట్ ఆరోపణ**



**విజయవాడ మన జనప్రగతి జూన్ 24:** ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన విజయవాడ యువకుడు గాదె సాయికృష్ణ అదృశ్యం కేసు కీలక మలుపు తీసుకుంది. ఇది అదృశ్యం కేసు కాదని, పోలీసు కస్టడీలో జరిగిన మరణం (లాకప్ డెత్) అని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) స్పష్టం చేసింది. ఈ కేసుకు సంబంధించి సస్పెండైన కృష్ణలంక సీఐ నాగరాజుకు **మిగతాది** 2లో...

# ప్రజల సమస్యలే ప్రాధాన్యం

- గంటన్నరపాటు 'డయల్ యువర్ ఎమ్మెల్యే'
- ప్రజలతో మంత్రి పార్థసారధి ప్రత్యక్ష సంభాషణ.
- కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 4.51 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి.
- ఆధిపత్య రాజకీయాలు, అరాచకాలు, విధ్వంసక చర్యలను సహించబోం.
- నూజివీడులో ప్రశాంత వాతావరణం నెలకొల్పడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం
- సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారధి.



**విజయవాడ, మన జనప్రగతి జూన్ 24:**రాష్ట్రంలోనే నూజివీడు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందని సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, గృహ నిర్మాణం, రైతుల సంక్షేమం, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పార్థసారధి పేర్కొన్నారు.విజయవాడ రూరల్ తాడిగడప 100 ఫీట్ రోడ్డులో ఉన్న సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖల మంత్రి శ్రీ కొలుసు పార్థసారథి క్యాంపు

మిగతా2లో...

# సాయికృష్ణది లాకప్ డెత్

**(మొదటి పేజీ తరువాయి)**

విజయవాడ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. సిట్ కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో పలు కీలక విషయాలను వెల్లడించింది. మే 6న మార్కాపురం నుంచి సాయికృష్ణను అదుపులోకి తీసుకుని కృష్ణలంక పోలీస్ స్టేషన్‌కు తరలించారని, అక్కడ కస్టడీలో చిత్రహింసల వల్లే అతను మరణించాడని తెలిపింది. తన కొడుకు పోలీస్ స్టేషన్‌లో తీవ్రగాయాలతో, అపస్మారక స్థితిలో కనిపించాడని సాయికృష్ణ తల్లి చెప్పిన విషయాన్ని కూడా సిట్ ప్రస్తావించింది.లాకప్ డెత్‌ను కప్పిపుచ్చేందుకు తీవ్ర ప్రయత్నాలు జరిగాయని సిట్ పేర్కొంది. మే 1 నుంచి జూన్ 1 వరకు పోలీస్ స్టేషన్‌లోని సీసీటీవీ ఫుటేజ్‌ను ఉద్దేశపూర్వకంగానే డిలీట్ చేశారని నివేదికలో స్పష్టం చేసింది. అంతేకాకుండా, సాయికృష్ణ మృతదేహాన్ని మాయం చేశారని, దాన్ని ఖననం లేదా దహనం చేసేందుకు ప్రయత్నించారని సిట్ తెలిపింది. ఇప్పటికీ మృతదేహం లభ్యం కాలేదని పేర్కొంది. సీఐ నాగరాజు ఉద్దేశపూర్వకంగానే ఆధారాలను నాశనం చేసినట్టు తెలుస్తోందని సిట్ పేర్కొంది.సీఐ నాగరాజు దర్యాప్తునకు ఏమాత్రం సహకరించడం లేదని, తప్పుదోవ పట్టించే సమాధానాలు ఇస్తున్నారని సిట్ ఆరోపించింది. సాయికృష్ణను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచకుండా అక్రమంగా నిర్బంధించి, హైకోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చారని కూడా రిపోర్టులో పేర్కొన్నారు. కాగా, నిన్న 5 గంటల సుదీర్ఘ విచారణ అనంతరం సీఐ నాగరాజును సిట్ అధికారులు అరెస్ట్ చేయడం తెలిసిందే. ఈ క్రమంలో నాగరాజును జీజీహెచ్‌లో వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరుపరచగా, జులై 8 వరకు రిమాండ్‌కు తరలించారు. కేసు చాలా సంక్లిష్టంగా ఉందని, దర్యాప్తునకు మరింత సమయం అవసరమని సిట్ కోర్టుకు విన్నవించింది. కేసు దర్యాప్తు నేపథ్యంలో, పోలీస్ శాఖ ఇప్పటికే సీఐ నాగరాజును విధుల నుంచి సస్పెండ్ చేసింది.

# ప్రజల సమస్యలే ప్రాధాన్యం

**(మొదటి పేజీ తరువాయి)**

కార్యాలయంలో బుధవారం నిర్వహించిన డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో నూజివీడు నియోజకవర్గంలోని ప్రజలతో పలు కీలక అంశాలపై మంత్రి పార్థసారధి బుధవారం ఉదయం మాట్లాడారు. ప్రజల సమస్యలే ప్రాధాన్యం... గంటన్నరపాటు 'డయల్ యువర్ ఎమ్మెల్యే' లో ప్రజలతో మంత్రి పార్థసారథి ప్రత్యక్ష సంభాషణ..నూజివీడు నియోజకవర్గ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలనే ఉద్దేశంతో మంత్రి కొలుసు పార్థసారథి నిర్వహించిన 'డయల్ యువర్ ఎమ్మెల్యే' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. దాదాపు రెండు గంటల పాటు వందలాది మంది ప్రజలతో ఫోన్ ద్వారా మాట్లాడిన మంత్రి, ప్రతి ఒక్కరి సమస్యను ఎంతో ఓర్పుగా ఆలకిస్తూ, వారికి తగిన భరోసా కల్పించారు.కాలనీల్లో మౌలిక వసతుల కల్పన, రోడ్లు, మంచినీటి సమస్యలు, వ్యక్తిగత భూముల వివాదాలు, వయోవృద్ధుల పెన్షన్ల మంజూరు వంటి సమస్యలతోపాటు విద్యార్థులకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులను వారి మొబైల్ నంబర్లు తీసుకుని వెంటనే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా విన్న మంత్రి, ప్రతి సమస్యకు పరిష్కారం చూపేందుకు నా వంతు కృషి చేస్తాను అంటూ ప్రజలకు హామీ ఇచ్చారు.కార్యక్రమం కొనసాగుతున్నంతసేపూ నిరంతరం ఫోన్ కాల్స్ వెల్లువెత్తాయి. వందలాది మందితో మాట్లాడిన తర్వాత కూడా కాల్స్ వస్తూనే ఉన్నప్పటికీ, మంత్రి ఏమాత్రం విసుగు చెందకుండా ప్రజలతో మాట్లాడి, సమస్యల స్వభావాన్ని బట్టి సంబంధిత అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేస్తూ, పరిష్కార ప్రక్రియను అక్కడికక్కడే ప్రారంభించారు. ప్రజలు కూడా నియోజకవర్గంలో మంత్రి పనితీరును ప్రశంసించడం అభినందనీయంగా చెప్పుకోవచ్చు.నూజివీడు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. గత కొంతకాలంగా నిలిచిపోయిన రోడ్లు, డ్రైనేజీలు తదితర అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. నూజివీడు పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారంగా రింగ్ రోడ్డు (బైపాస్) నిర్మాణానికి అవసరమైన భూసేకరణ నిధులు విడుదలయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభమవు తాయని తెలిపారు. మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని, ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ పరిష్కార చర్యలు చేపడుతోందన్నారు. మామిడికాయల రక్షణ కోసం కవర్ల పంపిణీ, పంట బీమా వంటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. నూజివీడులో ప్రశాంత వాతావరణం నెలకొల్పడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆధిపత్య రాజకీయాలు, అరాచకాలు, విధ్వంసక చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం యువతను తప్పుదోవ పట్టించడం, నేరాలకు ప్రోత్సాహం ఇవ్వడం సమాజానికి హానికరమని అన్నారు. రాజకీయాలు యువతను అభివృద్ధి, సేవా దృక్పథం వైపు నడిపించాలని సూచించారు. సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, అవినీతి నిర్మూలనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వం ప్రచార ఆర్భాటం కోసం నివాసయోగ్యం కాని ప్రాంతాలు, రవాణా సౌకర్యాలు లేని ప్రాంతాలు, కొండలు, స్మశానాలు, చెరువుల పరిసరాల్లో కూడా ఇళ్ల స్థలాలు కేటాయించడం వల్ల అనేక సమస్యలు ఏర్పడ్డాయని విమర్శించారు. పేదలకు కేటాయించే గృహ స్థలాలు వారి ఉపాధికి అనుకూ లంగా, మౌలిక సదుపాయాలు కలిగిన ప్రాంతాల్లో ఉండాల్సిన అవసరం ఉందన్నారు.ప్రస్తుతం గతంలో కేటాయించిన లేఅవుట్లలో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు.

# తెలంగాణ కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు..!

**(మొదటి పేజీ తరువాయి)**

ముగియనుండటంతో అదే రోజున సంజయ్ జాజు నూతన సీఎస్‌గా బాధ్యతలు చేపట్టనున్నారని అధికారిక వర్గాల సమాచారం.

**జాజు కెరీర్ ట్రాక్ రికార్డ్ ఇదే!**

1992 బ్యాచ్, తెలంగాణ కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అయిన సంజయ్ జాజు, దాదాపు 13 ఏళ్ల సుదీర్ఘ కాలం పాటు కేంద్ర సర్వీసుల్లో పనిచేశారు. తెలంగాణ కేడర్ అధికారులలో ఇంత ఎక్కువ కాలం కేంద్ర సర్వీసుల్లో పనిచేసిన వారిలో ఆయన ఒకరు. కేంద్ర సమాచార, ప్రసార శాఖ కార్యదర్శిగా, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు.

ప్రస్తుత సీఎస్ పదవీ విరమణకు సరిగ్గా వారం రోజుల ముందు ఆయనను సొంత కేడర్‌కు పంపుతూ కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ నిన్న ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన నియామకం దాదాపు ఖాయమైంది. "తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థన మేరకు సంజయ్ జాజును ఆయన సొంత కేడర్‌కు తిరిగి పంపేందుకు కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపిందని" ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయన తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్‌గా, నాటి హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా సమర్థవంతంగా పనిచేశారు. అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయన వైపు మొగ్గు చూపడానికి ప్రధాన కారణం కేంద్రంలో ఆయనకున్న విస్తృత అనుభవం, పరిచయాలేనని తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న పలు ప్రాజెక్టులకు కేంద్రం నుంచి అనుమతులు, నిధులు సాధించేందుకు కేంద్ర మంత్రిత్వ శాఖలతో బలమైన సమన్వయం అవసరమని ముఖ్యమంత్రి భావిస్తున్నారు.

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణ, మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు, కొత్త విమానాశ్రయాల అభివృద్ధి, రీజినల్ రింగ్ రోడ్, ప్రతిపాదిత బుల్లెట్ రైలు కారిడార్లు, రీజినల్ రింగ్ రైల్ ప్రాజెక్టు, భారత్ ఫ్యూచర్ సిటీ వంటి కీలక ప్రాజెక్టులకు కేంద్రం నుంచి అనుమతులు, ఆర్థిక సహకారం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంలో సంజయ్ జాజుకున్న అనుభవం, అక్కడి పనివిధానంపై ఉన్న అవగాహన తెలంగాణకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని సీఎం రేవంత్ రెడ్డి విశ్వసిస్తున్నట్లు సమాచారం.

సీఎస్ పదవి కోసం సీనియర్ అధికారులు జయేష్ రంజన్, వికాస్ రాజ్ వంటి వారి పేర్లు కూడా పరిశీలనలో ఉన్నప్పటికీ, సుదీర్ఘ సర్వీస్ (2028 మార్చి వరకు), కేంద్రంలో ఉన్న నెట్‌వర్క్‌ను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి చివరికి సంజయ్ జాజును ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఇక, ప్రస్తుత సీఎస్ రామకృష్ణారావు పదవీ కాలం ఈ నెల 30తో ముగియనుంది. వాస్తవానికి 2025 ఆగస్టులోనే పదవీ విరమణ చేయాల్సి ఉన్నా, ఆయనకు రెండు విడతల్లో మొత్తం 10 నెలల పాటు ప్రభుత్వం పదవీ కాలాన్ని పొడిగించిన విషయం తెలిసిందే.

# త్వరలో బీసీ రక్షణ చట్టం

**(మొదటి పేజీ తరువాయి)**

సమావేశమయ్యారని,బీసీ రక్షణ చట్టం అసెంబ్లీలో ఆమోదం పొందగానే, కేంద్రానికి పంపించనున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కర్నూలు, ఏలూరు, నెల్లూరులో బీసీ భవనాలను మంజూరు చేశాం.ఒక్కో బీసీ భవనాన్ని రూ. రూ.7 కోట్లతో నిర్మిస్తున్నట్లు మంత్రి సవిత చెప్పారు.రాష్ట్ర వ్యాప్తంగా రూ.10 కోట్లతో 48 బీసీ కమ్యూనిటీ హాళ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. బీసీ కార్పొరేషన్ ద్వారా 2 ఏళ్లలో 117.68 లక్షల మంది బీసీ లబ్దిదారులకు రూ.32,533.68 కోట్లు అందజేసినట్లు తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కింద 2024-26 మధ్య 29,16,610 లక్షల బీసీ లబ్ధిదారులకు రూ.25,021.88 కోట్లు, దీపం -2 కింద 54,10,116 లక్షలకు బీసీ లబ్ధిదారులకు రూ.1,864.77 కోట్లు, ఫీజు రియింబర్స్ మెంట్ కింద 2025-26లో 1,17,034 లక్షల మంది బీసీ విద్యార్థులకు రూ.911.51 కోట్లు అందజేసినట్లు పేర్కొన్నారు.

తల్లికి వందనం పథకం కింద ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున 30,38,564 లక్షల మంది బీసీ విద్యార్థులకు రూ.3950.13 కోట్లు,ఆటో డ్రైవర్ సేవలో పథకంలో భాగంగా ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున 1,61,538 మంది ఆటో డ్రైవర్లకు రూ.242.31 కోట్లు,పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్పులుగా రూ.0.72 కోట్లను 558 మంది బీసీ విద్యార్థులకు అందజేసినట్లు తెలిపారు.సామాజిక వర్గీయులకు కేంద్ర ప్రభుత్వ సూచనతో సీఎం చంద్రబాబు 10 శాతం రిజర్వేషన్లు కల్పించారు. వాటిలో కాపులకు 5 శాతం రిజర్వేషన్లు ఇచ్చారు.. ఆ రిజర్వేషన్లను జగన్ రద్దు చేశారని గుర్తు చేసారు. 2014-19లో కాపు సామాజికవర్గ సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం జిల్లా స్థాయిలో 13 కాపు భవనాలు, 487 మినీ కాపు భవనాల నిర్మాణానికి సీఎం చంద్రబాబు నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. తరవాత వచ్చి జగన్ ప్రభుత్వంలో 13 జిల్లా స్థాయి కాపు భవనాల్లో 9 కాపు భవనాలను రద్దు చేశారని అన్నారు. 487 మినీ కాపు భవనాలకు గాను 421 మినీ కాపు భవనాలు రద్దు చేశారని చెప్పారు.

ప్రస్తుతం 40 కాపు భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయని అన్నారు. వాటి నిర్మాణల పూర్తిచేయడానికి రూ.30 కోట్లకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. నా బీసీలు అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రంలో వెనుబడిన కులాలను ఉక్కుపాదంతో అణిచివేశారని మంత్రి సవిత అన్నారు. బీసీలు టీడీపీ పక్షమేనని జగన్ భావన అని అందుకే అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వారిని అణగదొక్కడం ప్రారంభించారని పేర్కొన్నారు. బీసీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించారని,బీసీ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించకుండా, స్వయం ఉపాధి రుణాలు నిలిపేశారని, ఆదరణ పథకాలను రద్దు చేశారని గుర్తు చేసారు. పల్నాడు జిల్లాలో తోట చంద్రయ్య, బాపట్లలో అమర్నాథ్ గౌడ్ వంటి పలువురు బీసీలను దారుణంగా హత్య చేయడమే కాకుండా, బీసీలపై అక్రమ కేసులు బనాయించారని, ప్రస్తుత అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్రతో పాటు తనపైనా, సామాన్య బీసీ కార్యకర్తలపైనా అక్రమ కేసులు బనాయించారని మంత్రి సవిత పేర్కొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డికి హైకోర్టులో ఊరట...

**(మొదటి పేజీ తరువాయి)**

2019లో జరిగిన హుజూర్‌నగర్ ఉప ఎన్నికల సమయంలో ఈ కేసులు నమోదయ్యాయి. అప్పటి మల్కాజ్‌గిరి ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి తరఫున చురుకుగా ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో, రిటర్నింగ్ అధికారి నుంచి ముందస్తు అనుమతి లేకుండా సమావేశాలు నిర్వహించడం వంటి ఎన్నికల ప్రవర్తనా నియమావళి నిబంధనలను ఉల్లంఘించారనే ఆరోపణలతో ఆయనపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ కేసులను కొట్టివేయాలని రేవంత్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఆయన పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయస్థానం, జూన్ 18న తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా బుధవారం తీర్పును ప్రకటిస్తూ, ఐదు కేసులను కొట్టివేస్తున్నట్లు స్పష్టం చేసింది. హైకోర్టు తాజా తీర్పుతో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసులకు చట్టపరంగా ముగింపు పలికినట్లయింది.

## నేడు తుంగభద్ర ప్రాజెక్టు కొత్త స్పిల్‌వే గేట్ల ప్రారంభోత్సవం

**హైదరాబాద్, మన జనప్రగతి జూన్ 24:**

ఏపీ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు సాగు, తాగునీరు అందించే కీలకమైన తుంగభద్ర ప్రాజెక్టుకు కొత్త జవసత్వాలు రానున్నాయి. ప్రాజెక్టుకు కొత్తగా అమర్చిన స్పిల్‌వే గేట్లను నేడు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ కూడా పాల్గొంటారు. మూడు రాష్ట్రాలకు చెందిన కీలక నేతల సమక్షంలో ఈ కార్యక్రమం జరగనుండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.తుంగభద్ర ప్రాజెక్టుకు మొత్తం రూ. 51 కోట్ల వ్యయంతో 33 కొత్త స్పిల్‌వే గేట్లను ఏర్పాటు చేశారు. 2024 ఆగస్టులో సంభవించిన వరదల సమయంలో ప్రాజెక్టు 19వ నంబర్ గేటు కొట్టుకుపోయింది. ఇది తీవ్ర ఆందోళనకు దారితీసింది. ఆ సమయంలో సీనియర్ ఇంజనీర్ కన్నయ్య నాయుడు నేతృత్వంలోని సాంకేతిక బృందం తాత్కాలికంగా స్టాప్-లాక్ గేటును ఏర్పాటు చేసి నీటిని నియంత్రించింది. ఈ ఘటన అనంతరం నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ రంగంలోకి దిగి ప్రాజెక్టును పరిశీలించింది. భద్రతా కారణాల దృష్ట్యా పాత గేట్లన్నింటినీ తొలగించి, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది.ఈ సిఫార్సుల మేరకు ఏపీ, కర్ణాటక రాష్ట్రాలు సంయుక్తంగా పనులు చేపట్టాయి. యుద్ధప్రాతిపదికన కేవలం ఆరు నెలల వ్యవధిలోనే 33 కొత్త గేట్ల నిర్మాణాన్ని పూర్తి చేశాయి. ఈ కొత్త గేట్ల ఏర్పాటుతో వరదల సమయంలో నీటి ప్రవాహాన్ని మరింత సమర్థవంతంగా నియంత్రించవచ్చని, నీటి వృథాను గణనీయంగా తగ్గించవచ్చని అధికారులు తెలిపారు.రాయలసీమకు జీవనాడిగా భావించే ఈ ప్రాజెక్టు ద్వారా కుడి ప్రధాన కాలువ కింద కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల్లో సుమారు 1.46 లక్షల హెక్టార్లకు సాగునీరు అందుతోంది. అనేక గ్రామాలకు తాగునీటి అవసరాలు కూడా ఈ ప్రాజెక్టు తీరుస్తోంది. గేట్ల ప్రారంభోత్సవం అనంతరం నేతలందరూ హోస్పేటలో జరిగే బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించనున్నారు.

# ఏపీలో సువర్ణ అధ్యాయం

**(మొదటి పేజీ తరువాయి)**

గతంలో జొన్నగిరిని స్వర్ణగిరిగా పిలిచేవారని.. మన దగ్గర కూడా బంగారం ఉత్పత్తి కాబోతోందని తెలిపారు. భవిష్యత్‌లో దేశమంతా జొన్నగిరి గురించే మాట్లాడుతుందని వెల్లడించారు. ఒకప్పుడు కెజిఎఫ్... ఇప్పుడు జెజిఎఫ్ అని ముఖ్యమంత్రి అన్నారు. చమురు తర్వాత దేశంలో ఎక్కువ దిగుమతి అయ్యేది బంగారమే అని తెలిపారు. రాయలసీమలో సిరులు పండించేందుకు శరవేగంగా సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నామని చెప్పారు. ఏడాదికి టన్ను బంగారం ఉత్పత్తి అవుతుందని తెలిపారు. ప్రస్తుతం 400 కిలోల సామర్థ్యంతో బంగారం ఉత్పత్తి అవుతుందని, భవిష్యత్‌లో 1000 కిలోల బంగారం ఉత్పత్తి చేయనున్నట్లు వెల్లడించారు. రెండో యూనిట్‌తో కలిపి 50 టన్నుల బంగారం ఉత్పత్తి అవుతుందన్నారు. ఇప్పటికే 800 మందికి ఉద్యోగాలు లభించాయని.. త్వరలో మరో 1500 మందికి ఉపాధి లభించనుందన్నారు. భవిష్యత్‌లో 5 వేల మందికి స్వర్ణగిరి గోల్డ్ మైన్స్‌లో ఉపాధి లభిస్తుందని సీఎం పేర్కొన్నారు. గోల్డ్ మైనింగ్‌తో జొన్నగిరిలో పూర్వ వైభవానికి శ్రీకారం చుట్టామని అన్నారు.రాయలసీమను రతనాల సీమగా మార్చడం జొన్నగిరి నుంచే ప్రారంభమవుతుంది. ఈ ప్రాంతాన్ని గతంలో సువర్ణగిరి అని పిలిచేవారు. అశోకుడి నాలుగో రాజధాని ఇది. జొన్నగిరిని సువర్ణగిరిగా మార్చుకుందామా? వందల ఏళ్ల క్రితమే ఈ ప్రాంతం బంగారం, రత్నాలతో నిండింది. అశోకుడి శాసనాలు ఈ ప్రాంత వైభవాన్ని చాటి చెబుతున్నాయి. సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసి సీమను కాపాడాలనే ఆలోచన చేసిన వ్యక్తి ఎన్టీఆర్. ఆయన నిర్ణయంతో రాయలసీమ ప్రాంతానికి ప్రాణం పోశాం అని అన్నారు. ఇప్పటికి 400 కిలోల సామర్థ్యంతో ప్రారంభమైంది. భవిష్యత్తులో వెయ్యి కిలోలకు చేరుతుంది. ఇప్పటికే 800 ఉద్యోగాలు వచ్చాయి. త్వరలో 1500 మందికి ఉపాధి కల్పిస్తాం. భవిష్యత్తులో 5వేల మందికి ఈ గోల్డ్ మైన్స్‌లో ఉపాధి దొరుకుతుంది. కులమతాల పేరుతో గొడ్డలి పార్టీ విషం చిమ్ముతోందన్నారు. నేరాలు, ఘోరాలు చేసి రాజకీయ రంగు పులుముతున్నారన్ని ÷ర్ అయ్యారు. రప్పా రప్పా రాజకీయం తప్ప గొడ్డలి పార్టీ చేసిందేమిలేదన్నారు. మళ్లీ వస్తాం.. గొడ్డలితో రప్పా రప్పా ఆడిస్తామంటున్నారని సీఎం చంద్రబాబు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కెసిఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారు

**(మొదటి పేజీ తరువాయి)**

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఏవర్గాన్ని వదిలిపెట్టకుండా కాంగ్రెస్ సర్కార్ వేధిస్తోందని ధ్వజమెత్తారు. సత్తుపల్లి విలేకర్లకు మండల రిపోర్టర్లుగా అక్రిడిటేషన్ జారీ చేసి రేవంత్‌రెడ్డి సర్కార్ అన్యాయం చేసిందని మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహించారు. మొన్న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కల్లూరు మున్సిపాల్టీ బీఆర్ఎస్ గెలిచేదని.. సత్తుపల్లిలో కూడా స్వల్ప ఓట్లతో ఈ స్థానం చేజార్చుకున్నామని తెలిపారు. ఆయా ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిస్తే పార్టీ శ్రేణులు పొంగిపోకూడదని.. ఓడితే కృంగిపోకూడదని పేర్కొన్నారు. తెలంగాణ మారుమూల ప్రాంతాలు ఎక్కడకు వెళ్లినా దుర్మార్గపు కాంగ్రెస్ పాలన పోవాలని.. కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన తర్వాత కేసీఆర్ హయాంలోని మొదటి పదేళ్లు పునాది రాళ్లు వేసుకున్నామని వివరించారు. రాష్ట్రంలో మళ్లీ అభివృద్ధి జరగాలంటే కేసీఆర్ రావాలని ప్రజలే అంటున్నారని తెలిపారు. కేసీఆర్ ఓటములు, గెలుపులు చూశారని.. అనాడు తెలుగుదేశం పార్టీలో అన్నగారితో కలిసి నడిచారని ప్రస్తావించారు. అన్నదాతలకు రైతుబంధు పూర్తిగా చేయకుండా వేధిస్తోందని ధ్వజమెత్తారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలోనూ రేవంత్‌రెడ్డి సర్కార్ విఫలమైందని మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఇదే ఖమ్మం జిల్లాకు, కొత్త గూడెం జిల్లాకు, ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరిలోని నీటిని ఒడిసిపట్టి మొత్తం సస్యశ్యామలం కావాలి.. ఖమ్మం జిల్లా రూపు రేఖలను మార్చాలనే ప్రయత్నం కేసీఆర్ బలంగా చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ వాళ్లు జల యజ్ఞంలో భాగంగా రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్ అనే రెండు ప్రాజెక్టులకు రాళ్లు వేసి పోయారు. కానీ చేసింది పెద్దగా ఏం లేదు. కానీ కేసీఆర్ ఎవరో సంబంధం లేని నాయకుల పేర్లు ఎందుకని ఆలోచన చేసి మీ జిల్లా మొత్తం తెలంగాణకు ఆరాధ్య దైవమైన భద్రాద్రి సీతారామ స్వామి వారి పేరు మీద సీతారామ ప్రాజెక్టు అని పెట్టి మన జిల్లాకు 7 లక్షల ఎకరాలకు.. కొత్తగా నాలుగురన్నర లక్షల ఎకరాలకు కొత్త ఆయకట్టు.. ఎన్ఎస్‌పీల కింద కాలువల కింద ఉండే వ్యవసాయాన్ని స్థిరీకరించడానికి 2.50 లక్షల ఎకరాలకు మొత్తంగా 7 లక్షల ఎకరాలకు సాగునీరందించే బృహత్తర యజ్ఞానికి శ్రీకారం చుట్టారు.అంటే 80 శాతం నిధులు మనం ఇప్పటికే ఖర్చు పెట్టాం. మరి ఈ రెండున్నర సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత జిల్లా మొత్తం కాంగ్రెస్‌కే గెలుపు అందించిన తర్వాత వాళ్లు మనకేం ఇచ్చారు.. ఇవాళ ఖమ్మం జిల్లా రైతులు ఆలోచన చేయాలి. జిల్లా నుంచి ఉపముఖ్యమంత్రి, వ్యవసాయ మంత్రి, రెవెన్యూ మంత్రి.. ముగ్గురు మంత్రులున్నారు. పవర్‌ఫుల్ పోర్ట్‌పోలియోల్లో ఉన్నారు.. పవర్ అంతా ఖమ్మం జిల్లాలోనే ఉందట. కానీ ఖమ్మం జిల్లా ప్రజలకు ఏం ఒరిగింది. ఖమ్మం జిల్లా రైతులకు ఏం జరిగింది.. దయచేసి మీరు ఆలోచించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

# మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్న డిప్యూటీ సీఎం పవన్

**(మొదటి పేజీ తరువాయి)**

కొలువైన శ్రీ పానకాల లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాన్ని సందర్శించారు. పానకాల స్వామి వారికి పట్టువస్త్రాలతోపాటు పానకం నైవేద్యంగా సమర్పించి పూజలు చేశారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనాలు, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకు ముందు శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారిని దర్శించుకునేందుకు విచ్చేసిన శ్రీ పవన్ కళ్యాణ్ గారికి ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు మంగళవాద్యాలతో స్వాగతం పలికారు.

# అవనిగడ్డలో లోకేశ్ పర్యటన

**(మొదటి పేజీ తరువాయి)**

టీడీపీ కార్యకర్తలు, నేతల సమన్వయ సమావేశంలో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. పెదప్రోలులో మంత్రికి మచిలీపట్నం పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు వీరంకి గురుమూర్తి, అవనిగడ్డ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. మోపిదేవి మండలంలో ఆధునీకరించిన కొక్కిలిగడ్డ జడ్పీ ఉన్నత పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించారు. అనంతరం పాఠశాలలో మొక్కలు నాటారు. పాఠశాల ఆవరణలో గ్రామస్తులకు మంత్రి అభివాదం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, బోడె ప్రసాద్, వెనిగండ్ల రాము, ఎమ్మెల్సీ అశోక్ బాబు పాల్గొన్నారు. లోకేశ్ పర్యటన సందర్భంగా పెద్దఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చారు. ప్రతిఒక్కరికీ అభివాదం చేస్తూ మంత్రి ముందుకు సాగారు.

# జొన్నగిరి బంగారు గని ప్రారంభోత్సవంలో సీఎంకు వినతిపత్రం అందజేసిన తెర్నేకల్ వెంకప్ప



**దేవనకొండ మన జనప్రగతి జూన్ 24:**-కర్నూలు జిల్లా జొన్నగిరి బంగారు గని ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఆలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి తెర్నేకల్ వెంకప్ప బుధవారం వినతిపత్రం సమర్పించారు. హంద్రీ-నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) ప్రాజెక్టుకు సంబంధించిన పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పందికోన రిజర్వాయర్ సామర్థ్యాన్ని పెంచడం, పెండింగ్‌లో ఉన్న కాలువల నిర్మాణ పనులను పూర్తి చేయడం, భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయడం, ఆలూరుపత్తికొండ ప్రాంతాలకు సాగు మరియు తాగునీటి సౌకర్యాలను కల్పించడం వంటి కీలక అంశాలను వినతిపత్రంలో ప్రస్తావించారు. సమస్యలను సీఎం సానుకూలంగా స్వీకరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. హంద్రీ-నీవా ప్రాజెక్టు పూర్తయితే ఆలూరు, పత్తికొండ ప్రాంతాల్లో వేలాది ఎకరాలకు సాగునీరు అందడమే కాకుండా ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందుబాటులోకి వస్తుందని వెంకప్ప పేర్కొన్నారు. ప్రజల సమస్యలను నిరంతరం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తూ, ఆలూరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం కృషి కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# కలెక్టర్ కార్యాలయ క్యాంటీన్ నిర్వహణకు టెండర్లు ఆహ్వానం

**- ఆసక్తి గల వ్యక్తులు,సంస్థలు దరఖాస్తు చేసుకోవాలి**



**మదనపల్లె మన జనప్రగతి జూన్ 24:-** అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయం, మదనపల్లె ప్రాంగణంలో క్యాంటీన్ నిర్వహణ కోసం ఆసక్తి గల వ్యక్తులు,సంస్థల నుంచి టెండర్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కలెక్టర్ కార్యాలయానికి వచ్చే అధికారులు,ఉద్యోగులు,సందర్శకులు మరియు ప్రజలకు నాణ్యమైన ఆహార సేవలు అందించాలనే ఉద్దేశంతో క్యాంటీన్ నిర్వహణను టెండర్ విధానంలో అప్పగించనున్నట్లు పేర్కొన్నారు. టెండర్ పొందిన వ్యక్తి లేదా సంస్థ క్యాంటీన్ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను స్వంత వ్యయంతో చేపట్టాల్సి ఉంటుందని తెలిపారు. ఆహార పదార్థాల నాణ్యత,పరిశుభ్రత,సేవా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 24 నుంచి 29వ తేదీ సాయంత్రం వరకు తమ టెండర్ దరఖాస్తులను జిల్లా కలెక్టర్ కార్యాలయం,మదనపల్లెలో సమర్పించవచ్చని తెలిపారు. అందిన టెండర్లను జూన్ 30వ తేదీ ఉదయం కలెక్టర్ కార్యాలయంలో పరిశీలిస్తామని వెల్లడించారు. ఏ టెండర్‌నైనా కారణం చూపకుండా అంగీకరించే లేదా తిరస్కరించే పూర్తి హక్కు జిల్లా పరిపాలనకు ఉంటుందని స్పష్టం చేశారు. మరిన్ని వివరాల కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

# తెదేపాతోనే నియోజకవర్గ అభివృద్ధి

**- నియోజకవర్గ అభివృద్ధికి మా నాన్న..బాబాయ్ ఎంతో కృషి చేశారు.**



**కర్నూలు బ్యూరో పతికొండ మన జనప్రగతి జూన్ 24:**తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉందంటే నియోజకవర్గాలు అభివృద్ధి చెందుతాయని,అందుకు నిదర్శనం పత్తికొండ నియోజకవర్గం అని స్థానిక ఎమ్మెల్యే కే.ఈ. శ్యాం కుమార్ అన్నారు. బుధవారం కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం జొన్నగిరి జియో మైసూర్ గోల్డ్ మైన్స్ రెండవ దశ పనులను ప్రారంభానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు తెదేపా శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పత్తికొండ ఎమ్మెల్యే కే.ఈ శ్యాం కుమార్ మాట్లాడుతూ జొన్నగిరి గోల్డ్ మైన్ ప్రాజెక్టుకు సంబంధించి 2009 నుంచే భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైందని, అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న కేఈ ప్రభాకర్ ఈ ప్రాజెక్టు కు తగిన సహకారం అందించారని గుర్తు చేశారు. 20142019 కాలంలో ఉప ముఖ్యమంత్రిగా ఉన్న కే.ఈ. కృష్ణమూర్తి నాయకత్వంలో వాటర్ రిసోర్సెస్, పర్యావరణ అనుమతులు తదితర అంశాల్లో ప్రభుత్వ సహకారం అందించి ప్రాజెక్టు ముందుకు సాగేందుకు కృషి చేశామని తెలిపారు. అయితే గత ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు పురోగతి మందగించిందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవతో అన్ని అనుమతుల ప్రక్రియలను వేగవంతం చేసి, జొన్నగిరి గోల్డ్ మైన్ ప్రారంభానికి మార్గం సుగమం చేశారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ గోల్డ్ మైన్ ప్రారంభంతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి కొత్త ఊపునిస్తుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు విజయవంతం కావడంలో ప్రజల సహకారం ఎంతో కీలకమైందని,జొన్నగిరి ప్రాంతం పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. జొన్నగిరి ప్రాంత ప్రజలు ఎన్నో ఏళ్లుగా వర్షాధార వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తూ అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని,ఈ ప్రాంత అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు కృషి చేస్తోందన్నారు. 20142019 మధ్య ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో 250 కోట్ల రూపాయల వ్యయంతో 68 చెరువులకు నీరు అందించి రైతాంగానికి సాగునీటి భరోసా కల్పించిన ఘనత మన ప్రభుత్వానిదే నన్నారు. లక్ష కోట్ల హార్టికల్చర్ ప్లాన్ ఒకటి కేంద్రం నుంచి మంజూరు అయిందని, ఇక్కడ పత్తికొండ కు పైలట్ ప్రాజెక్ట్ గా డిక్లేర్ చేయాలని ఎమ్మెల్యే ముఖ్యమంత్రి ని కోరారు.

# రాష్ట్రంలో సువర్ణాధ్యాయం ప్రారంభం

**జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్ ప్రారంభించిన సీఎం చంద్రబాబు**

**రాయలసీమ అభివృద్ధికి గ్రోత్ ఇంజిన్‌గా గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు**



**జొన్నగిరి మన జనప్రగతి జూన్ 24:** రాష్ట్ర చరిత్రలో సువర్ణాధ్యాయం ప్రారంభమైందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గంలోని జొన్నగిరిలో ఏర్పాటు చేసిన జియో మైసూర్‌డెక్కన్ గోల్డ్ మైన్స్ గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టును బుధవారం ఆయన ప్రారంభించారు. అలాగే ప్లాంట్ విస్తరణలో భాగంగా రెండో యూనిట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.405 కోట్ల పెట్టుబడితో ఏర్పాటైన ఈ ప్రాజెక్టు ద్వారా తొలి ఏడాది 400 కిలోల బంగారం ఉత్పత్తి చేయనుండగా, తదుపరి దశల్లో 900 కిలోలు, అనంతరం రెండు టన్నుల వరకు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచే లక్ష్యంతో సంస్థ ముందుకు సాగుతోంది. బంగారం తవ్వకం నుంచి శుద్ధి, తుది ఉత్పత్తి వరకు జరిగే ప్రక్రియలను సీఎం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ, జొన్నగిరి ప్రాంతానికి చారిత్రక ప్రాధాన్యం ఉందని, గతంలో దీనిని "సువర్ణగిరి"గా పిలిచేవారని గుర్తుచేశారు. బంగారం తవ్వకాలతో రాయలసీమకు పూర్వ వైభవం తిరిగి వస్తుందని, జొన్నగిరిని "స్వర్ణగిరి"గా అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని చెప్పారు. భవిష్యత్తులో ఇక్కడే జ్యువెలరీ పార్కు ఏర్పాటు చేసి, బంగారం ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహిస్తామని వెల్లడించారు. దేశంలో బంగారం దిగుమతులపై ఆధారాన్ని తగ్గించే దిశగా ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఖనిజ సంపదకు నిలయమని, బాక్సైట్, యురేనియం, గ్రానైట్, బరైట్స్, ఐరన్ ఓర్, సహజ వాయువు వంటి అపార వనరులు రాష్ట్రంలో ఉన్నాయని సీఎం వివరించారు. ఈ వనరుల ఆధారంగా విలువ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించి యువతకు స్థానికంగానే ఉపాధి కల్పిస్తామని తెలిపారు. రాయలసీమ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, సాగునీటి ప్రాజెక్టులు, పారిశ్రామిక నోడ్లు, స్టీల్ ప్లాంట్లు, డ్రోన్ సిటీ, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో భారీ పెట్టుబడులను తీసుకొస్తున్నామని చెప్పారు. స్వర్ణగిరి గోల్డ్ ఫీల్డ్స్‌తో రాష్ట్రంలో కొత్త అభివృద్ధి యుగానికి శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రులు కొల్లు రవీంద్ర, నిమ్మల రామానాయుడు, టీజీ భరత్, పత్తికొండ ఎమ్మెల్యే కే.ఈ. శ్యామ్ కుమార్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. **మన బంగారం..మన వ్యాపారులకే** జొన్నగిరిలో ఉత్పత్తి చేసిన బంగారంతో రూపొందించిన ఆంధ్రప్రదేశ్ మ్యాప్‌ను జియో మైసూర్‌డెక్కన్ గోల్డ్ మైన్స్ సంస్థలు రాష్ట్ర ప్రభుత్వానికి బహూకరించాయి. ఈ జ్ఞాపికను అమరావతిలో ఏర్పాటు చేయనున్న మ్యూజియంలో ప్రతిష్ఠించనున్నట్లు సీఎం తెలిపారు. అలాగే జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్‌లో ఉత్పత్తి చేసిన తొలి బంగారాన్ని రాష్ట్రంలోని ప్రముఖ జ్యువెలరీ సంస్థలకు అందజేశారు. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే బంగారాన్ని స్థానిక వ్యాపారులకే విక్రయిస్తామని సంస్థ యాజమాన్యం ప్రకటించింది.

# గట్టు నరసింహస్వామి ఆలయంలో జగన్ ప్రత్యేక పూజలు





**విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న మాజీ సీఎం**

**శ్రీరామిరెడ్డి కుటుంబ సభ్యులకు పరామర్శ..మార్గమధ్యంలో ఘన స్వాగతం**

**వేముల మన జనప్రగతి జూన్ 24:** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బుధవారం వేముల మండలంలో పర్యటించి గట్టు శ్రీ నరసింహస్వామి దేవస్థానంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్నారు. పులివెందుల నుంచి రోడ్డు మార్గం గుండా వేల్పుల మీదుగా భూమయ్యగారిపల్లి గ్రామ సమీపంలోని ఆలయానికి కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డితో కలిసి చేరుకున్న జగన్‌కు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఆలయ నిర్వాహకులు, భక్తులు సైతం ఆయనకు ఆత్మీయ స్వాగతం అందించారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న జగన్, ప్రతిష్ఠకు సంబంధించిన కలశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య జరిగిన ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొని ఆశీర్వాదాలు స్వీకరించారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతలు, నిర్వాహకులను అభినందించారు. తదుపరి ఇటీవల మృతి చెందిన మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ పదవులలో దాదాపు 23 సంవత్సరాలు ఉన్నటువంటి ఓబుల్ రెడ్డి శ్రీరామిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసిన ఆయన, ధైర్యంగా ఉండాలని సూచిస్తూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం తిరుగు ప్రయాణంలో మార్గం మధ్యలోని గ్రామాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున రోడ్డుపైకి వచ్చి జగన్‌కు స్వాగతం పలికారు. పలువురు అభిమానులు ఆయనతో సెల్ఫీలు తీసుకుంటూ "జై జగన్" నినాదాలతో హోరెత్తించారు. మహిళలు, యువకులు, వృద్ధులు భారీ సంఖ్యలో తరలివచ్చి మాజీ ముఖ్యమంత్రిని చూసేందుకు ఆసక్తి చూపారు. దీంతో పర్యటన మార్గమంతా సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి. సతీష్ కుమార్ రెడ్డి, పార్టీ సంస్థాగత కార్యకలాపాల కార్యదర్శి వజ్ర భాస్కర్ రెడ్డి, పులివెందుల పట్టణ అధ్యక్షుడు దుశాంత్ రెడ్డి, వేముల మండల వైకాపా కన్వీనర్ నాగేల్ల సాంబశివరెడ్డి, జడ్పీటీసీ కోకటం వెంకట బైపిరెడ్డి, మండల పరిశీలకుడు లింగాల రామలింగారెడ్డి (వేల్పుల రాము), మాజీ పి బి సి అధ్యక్షుడు మరక శివకృష్ణారెడ్డి, ఎంపీపీ చల్లా గంగాదేవితో పాటు వైకాపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, భక్తులు పాల్గొన్నారు. పర్యటన విజయవంతంగా ముగియడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

# ఈ కొత్తపల్లిలో ఘనంగా ప్రారంభమైన మొహరం వేడుకలు





**ఐకమత్యానికి ప్రతీకగా మొహరం ఉత్సవాలు**

**విదేశాల్లో ఉన్న గ్రామస్తులు సైతం ప్రత్యేకంగా హాజరు**

**పులివెందుల, మన జనప్రగతి, జూన్ 24 :**పులివెందుల మండల పరిధిలోని ఈ కొత్తపల్లి గ్రామంలో మొహరం ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గత నాలుగు రోజులుగా కొనసాగుతున్న ఈ వేడుకలు గ్రామంలో భక్తి, సంప్రదాయాలు, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం ఈ కొత్తపల్లె గ్రామానికి చెందిన హస్తాలు, పీర్లను ప్రత్యేకంగా అలంకరించి గ్రామస్థులు భారీ ఊరేగింపుగా ఈ కొత్తపల్లి నుంచి నల్లపురెడ్డిపల్లె వరకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా డప్పు వాయిద్యాలు, వివిధ వేషధారణలు, సంప్రదాయ కళారూపాలు ఆకట్టుకున్నాయి. ముందుగా గ్రామంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం చంద్రగిరి, ఎర్రబెల్లి గ్రామాల మీదుగా నల్లపురెడ్డిపల్లెకు చేరుకుని అక్కడ పీర్ల సాడి వద్ద స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తిరిగి ఈ కొత్తపల్లి గ్రామానికి చేరుకున్న ఊరేగింపు ప్రధాన వీధుల గుండా సాగింది. గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని పీర్లపాడులో పీర్లను కొలువుదీశారు. గురువారం రాత్రి సంప్రదాయబద్ధంగా అగ్నిగుండం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందు కోసం గ్రామ పరిసర ప్రాంతాల నుంచి పెద్ద పెద్ద మద్దులు, చెట్ల కర్రలను తీసుకువచ్చి అగ్నిగుండాన్ని సిద్ధం చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ప్రత్యేక కార్యక్రమాల అనంతరం స్వామివారిని బావి వద్దకు తీసుకెళ్లడంతో ఉత్సవాలు ముగియనున్నాయి. ముఖ్యంగా ఈ కొత్తపల్లి గ్రామంలో అన్ని వర్గాల ప్రజలు కుల, మత భేదాలకు అతీతంగా ఐకమత్యంతో మొహరం వేడుకలను నిర్వహించడం విశేషం. అలాగే విద్య, ఉద్యోగ, వ్యాపార రీత్యా ఇతర ప్రాంతాలు, విదేశాల్లో స్థిరపడిన గ్రామస్తులు సైతం ప్రతి ఏడాది మొహరం ఉత్సవాలకు హాజరై తమ గ్రామ సంప్రదాయాల పట్ల ఉన్న అనుబంధాన్ని చాటుకుంటున్నారు. గ్రామంలో భక్తి, సంప్రదాయం, సామరస్య వాతావరణంలో జరుగుతున్న మొహరం వేడుకలు స్థానికులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

## నందిపల్లె నందీశ్వర ఆలయంలో ఆలూరు ఎమ్మెల్యే వేరుపాక్షి ప్రత్యేక పూజలు


- ఆలయ మర్యాదలతో ఆహ్వానం



**వేంపల్లె మన జనప్రగతి జూన్ 24:**-మండలం లోని నందిపల్లి గ్రామంలో వెలసిన శ్రీనందీశ్వరుడి ఆలయంలో వైఎస్ఆర్సీపి ఎమ్మెల్యే వేరుపాక్షి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఆలయ కమిటీ ఛైర్మన్ మారం శ్రీకాంత్ రెడ్డి ఎమ్మెల్యే వేరుపాక్షి ని ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. అర్చకుల నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. అలాగే ఆలయ ప్రాంగణాలను సందర్శించి, నిర్మాణ పనులపై కొనియాడారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ మాజీ డైరెక్టర్ లింగారెడ్డి వీరప్రతాప్ రెడ్డి,వియన్ పల్లి ఎంపీపీ రఘునాథరెడ్డి దేవనకొండ జడ్పిటిసి కిట్టు పాల్గొన్నారు

## మురుగు నీటితో ఎస్సీ కాలనీవాసుల అవస్థలు





**సిద్ధవటం మన జనప్రగతి జూన్ 24:**-మండలంలోని సంటి గారి పల్లి ఎస్సీ కాలనీ సమీపంలో గత కొద్ది రోజులుగా మురుగు నీరు నిల్వ ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోందని, దోమల బెడద తీవ్రంగా పెరిగిందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం వారు మాట్లాడుతూ మురుగు నీరు నిల్వ ఉండటం వల్ల రాత్రి వేళల్లో నిద్ర లేకుండా పోతుందని, దోమల వ్యాప్తితో విష జ్వరాలు, అంటువ్యాధులు సోకే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు తొలగింపు చర్యలు చేపట్టలేదని పేర్కొన్నారు. మురుగు నీరు సక్రమంగా వెళ్లేందుకు అవసరమైన పనులు చేపట్టి, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ విషయంపై ఇన్‌చార్జి పంచాయతీ సెక్రటరీ రజియాను వివరణ కోరగా, సంటి గారి పల్లి ఎస్సీ కాలనీ వద్ద నిల్వ ఉన్న మురుగు నీటిని రెండు రోజుల్లో తొలగించి, విష జ్వరాలు వ్యాప్తి చెందకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## షామీర్య బ్రిడ్జి పనులను వేగవంతం చేయండి



**కడప మన జనప్రగతి జూన్ 24:**-కడపలో అభివృద్ధి పనుల వేగవంతం చేయాలని కడప ఎమ్మెల్యే మాధవి.టిడిపి కోఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. నగరంలోనిజువనైల్ హోమ్ వద్ద 'షామీర్య బ్రిడ్జి' నిర్మాణ పనులను పరిశీలించి పనులను వేగవంతం చేయాలని ఆరు నెలల్లో ప్రజలకు ఉపయోగపవాలని కార్పొరేషన్ అధికారులను ఆదేశించారుకడప నగరంలోని జువెనైల్ హోమ్ సమీపంలో నిర్మాణంలో ఉన్న షామీర్య బ్రిడ్జి పనులను అధికారులతో కలిసి పరిశీలించి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా బ్రిడ్జి నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, పనులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.నగర అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా చేపడుతున్న ఈ పనులు పూర్తయితే ప్రజలకు మెరుగైన రాకపోక సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని మాధవి,శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు,కాంట్రాక్టర్ నాయకులు టిడిపి నగర అధ్యక్షుడు మన్సూర్ అలీ ఖాన్,పాలకొండ చైర్మన్ రెడ్డయ్య యాదవ్,చల్లా రాజశేఖర్,సుబ్బారెడ్డి,మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 38 మంది బాధితులకు రూ.23 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణి

- నిరుపేదలకు సంజీవని సీఎం రిలీఫ్ ఫండ్
- పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూన్ 24:**నియోజకవర్గంలోని పార్టీలకతీతంగా 38 మంది బాధితులకు రూ. 23,00000/-(ఇరవై మూడు లక్షలు) రూపాయలు చెక్కులను అందజేసిన మారెడ్డి లతా రెడ్డి.బుధవారం పులివెందుల తెలుగుదేశం కార్యాలయంలో వివిధ కారణాల రీత్యా అనారోగ్య పరిస్థితుల్లో వైద్యం కోసం ఆసుపత్రులలో డబ్బులు ఖర్చు చేసిన 38 మంది బాధితులు పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి దృష్టికి తీసుకురాగా తక్షణమే స్పందించిన బీటెక్ రవి ఆయన సిఫార్సు లెటర్ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి కి అప్లై చేయగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 38 మంది బాధితులకు రూ. 23,00000/- రూపాయలు మంజూరైంది.అందుకు సంబంధించిన చెక్కులను బీటెక్ రవి సతీమణి మారెడ్డి లతా రెడ్డి తెలుగుదేశం కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. మారెడ్డి లతా రెడ్డి మాట్లాడుతూనిరుపేదలకు సంజీవని సీఎం రిలీఫ్ ఫండ్ అని కష్టకాలంలో కుటుంబానికి పెద్దకొడుకుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అండగా ఉంటున్నారని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేత్రత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల సంక్షేమం,ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తుందని అన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం అందిస్తుందని పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో వైద్యం, విద్య కు సీఎం నారా చంద్రబాబునాయుడు పెద్దపీట వేస్తున్నారని, రాష్ట్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారు భయపడవద్దని ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు.సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి కి కృతజ్ఞతలు తెలియజేశారు.

## పైడిపాలెంలో వేరుశెనగ సాగుపై అవగాహన సదస్సు

- రైతులకు విత్తన కాయల పంపిణీ
- రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం
- తుంగభద్ర ప్రాజెక్టు హెచ్.ఎల్.సి చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి





**సింహాద్రిపురం మన జనప్రగతి జూన్ 24:**-రైతన్నలు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అలవర్చుకుని అధిక దిగుబడులు సాధించడమే ప్రభుత్వ ధ్యేయమని తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ (హెచ్.ఎల్.సి) చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి,వెంపల్లె టీడీపీ ఇన్‌చార్జ్ అజ్జుగుట్టు రఘునాథరెడ్డి పేర్కొన్నారు. సింహాద్రిపురం మండలం పైడిపాలెం గ్రామంలో జాతీయ ఆహార నూనెల మిషన్ ఆధ్వర్యంలో రైతులకు వేరుశెనగ సాగుపై అవగాహన సదస్సు,విత్తన కాయల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.వేరుశెనగ సాగులో అనుసరించాల్సిన ఆధునిక పద్ధతులు,ఎరువుల సరైన మోతాదు మరియు చీడపీడల సమర్థవంతమైన నివారణపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు.సదస్సు అనంతరం అర్హులైన రైతులకు నాణ్యమైన వేరుశెనగ విత్తన కాయలను పంపిణీ చేశారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వ్యవసాయ సంక్షేమ పథకాలను రైతులందరూ సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని నేతలు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు విశ్వనాథ రెడ్డి, స్థానిక కార్యకర్తలు, వ్యవసాయ అధికారులు మరియు పైడిపాలెం గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ..ఓటర్ల వెరిఫికేషన్‌పై అవగాహన కలిగి ఉండాలి

- రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం యువజన విభాగం కార్యదర్శి అవ్వారు రవిశంకర్ పిలుపు



**సిద్దవటం మన జనప్రగతి జూన్ 24:**-గ్రామాలు, పట్టణాలు, ఆయా ప్రాంతాల్లో ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల వెరిఫికేషన్ (పరిశీలన, సర్) కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం యువజన విభాగం కార్యదర్శి అవ్వారు రవిశంకర్ కోరారు. బుధవారం మాధవరం-1 గ్రామంలో ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబంలోని సభ్యుల ఓట్లను తప్పనిసరిగా పరిశీలన చేయించుకుని,అవసరమైన వివరాలను సరిచేసుకుని తమ ఓటు హక్కును పునరుద్ధరించుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితాలో తమ పేరు లేకపోతే లేదా ఏవైనా తప్పులు ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సరిచేసుకోవాలని తెలిపారు. జూలై 14వ తేదీ వరకు కొనసాగనున్న ఈ ఓటర్ల వెరిఫికేషన్ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ పాల్గొని సహకరించాలని ఆయన కోరారు. దొంగ ఓట్లకు తావు లేకుండా, ఒకే వ్యక్తికి రెండు మూడు ప్రాంతాల్లో ఓట్లు నమోదు కాకుండా అధికారులు కచ్చితమైన పరిశీలన చేయాలని సూచించారు. అలాగే మరణించిన వ్యక్తుల పేర్లు, లేదా వేరే ప్రాంతాలకు శాశ్వతంగా తరలివెళ్లిన వారి వివరాలను తగిన ఆధారాలతో పరిశీలించి ఓటర్ల జాబితాను సక్రమంగా తయారు చేయాలని తెలిపారు. స్థానికంగా స్వగృహాలు కలిగి ఉండి, వృత్తి లేదా ఇతర ఉపాధి అవకాశాల కోసం బయట ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబ సభ్యులకు కూడా ఈ కార్యక్రమంపై సమాచారం అందించి అవగాహన కల్పించాలని సూచించారు. ఓటు అనేది ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కు అని, ఆ ఓటు హక్కు ద్వారా సమాజంలో మార్పు తీసుకురావచ్చని అవ్వారు రవిశంకర్ అన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు అనే ఆయుధాన్ని కలిగి ఉండాలని, ప్రజాస్వామ్య పరిరక్షణలో తమ బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. యువత కొత్త ఓటర్లుగా నమోదు చేసుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## కలెక్టర్ కార్యాలయ క్యాంటీన్ నిర్వహణకు టెండర్లు ఆహ్వానం

**మదనపల్లె మన జనప్రగతి జూన్ 24:**-అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయం, మదనపల్లె ప్రాంగణంలో క్యాంటీన్ నిర్వహణకు ఆసక్తి గల వ్యక్తులు, సంస్థల నుంచి టెండర్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చే అధికారులు, ఉద్యోగులు, సందర్శకులు, ప్రజలకు నాణ్యమైన ఆహార సేవలు అందించేందుకు క్యాంటీన్ నిర్వహణను టెండర్ విధానంలో అప్పగించనున్నట్లు పేర్కొన్నారు. టెండర్ పొందిన వ్యక్తి లేదా సంస్థ క్యాంటీన్ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను స్వంత వ్యయంతో చేపట్టాల్సి ఉంటుందని తెలిపారు. ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, సేవల ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.టెండర్ దరఖాస్తులను ఈ నెల 24వ తేదీ నుంచి 29వ తేదీ సాయంత్రం వరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం, మదనపల్లెలో సమర్పించవచ్చని తెలిపారు. అందిన టెండర్ల పరిశీలన ఈ నెల 30వ తేదీ ఉదయం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఏ టెండర్‌నైనా అంగీకరించే లేదా తిరస్కరించే పూర్తి హక్కు జిల్లా పరిపాలనకు ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. మరిన్ని వివరాల కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## బాలాయపల్లి పాఠశాల విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ



**పోరుమామిళ్ల మన జనప్రగతి జూన్ 24:**-కాశినాయన మండలంలోని బాలాయపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ.10 వేల విలువైన విద్యా సామాగ్రిని బుధవారం ఉచితంగా పంపిణీ చేశారు. దుబాయ్‌లో క్రీడా ఫోటోగ్రాఫర్‌గా పనిచేస్తున్న పోరుమామిళ్ల పట్టణం మహబూబ్‌నగర్ వీధికి చెందిన జిలాని ఈ విద్యా సామాగ్రిని అందించేందుకు ఆర్థిక సహాయం చేశారు.ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారుల చేతుల మీదుగా విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు తదితర విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు. ఫోన్ ద్వారా మాట్లాడిన దాత జిలాని, పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తనవంతు సహాయం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఉపాధ్యాయుడు ఖాసీం వలీ చొరవతోనే ఈ కార్యక్రమం విజయవంతమైందని పేర్కొన్నారు. సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు.విద్యార్థుల కోసం ముందుకు వచ్చి సహాయం చేసిన దాత జిలాని, కార్యక్రమ నిర్వహణలో కీలక పాత్ర పోషించిన ఉపాధ్యాయుడు ఖాసీం వలీలను పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పల్లా దస్తగిరిబాబు, ఉపాధ్యాయులు ఖాసీం వలీ, మండల విద్యాశాఖ అధికారులు మొహమ్మద్ షఫీ, నిర్మల, సీఆర్‌పీ ఖాజా మొహిద్దీన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాలకు ఇందిరమ్మ చీరల పంపిణీ




**శేరిలింగంపల్లి మన జనప్రగతి జూన్ 24:**-తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో భాగంగా శేరిలింగంపల్లి డివిజన్ కార్పొరేటర్ వార్డు కార్యాలయం ఆవరణలో బుధవారం మహిళా సంఘాలకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని డ్వాక్రా మహిళలకు చీరలను అందజేశారు.కార్యక్రమానికి పీఏసీ చైర్మన్,శాసనసభ్యులు అరెకపూడి గాంధీ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ రఘునాథ్ యాదవ్,కార్పొరేటర్లు హమీద్ పటేల్, నార్నె శ్రీనివాస్ రావుతో కలిసి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు చీరలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహిళా సంక్షేమం, ఆర్థిక స్వావలంబన కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఇందిరమ్మ చీరల పథకం ద్వారా పేద మహిళలకు ఆర్థిక భారం తగ్గించడంతో పాటు వారి జీవన ప్రమాణాలు మెరుగుపర్చడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మహిళల అభ్యున్నతే సమాజ అభివృద్ధికి పునాదిగా నిలుస్తుందని, ప్రతి మహిళకు గౌరవం, రక్షణ, అభివృద్ధి కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు వీరేశం గౌడ్, మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, సీనియర్ నాయకులు కే. రాంచందర్, సీఎంసీ డిప్యూటీ ప్రాజెక్టు అధికారి స్వాతి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు శ్రీకాంత్, రమా, పద్మ, వెంకట్‌రావు, గఫూర్, వార్డు సభ్యులు శ్రీకళ, కవిత, పర్వీన్ బేగం, డ్వాక్రా మహిళా సంఘాల అధ్యక్షురాళ్లు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## షా హుస్సేన్ వలి స్వామివారి బర్సీ ఉత్సవాలు ఘనంగా నిర్వహణ

**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూన్ 24:**-ప్రతి సంవత్సరం మొహరం మాసం 8వ రోజున (ఆట్ ఖన్) నిర్వహించే శ్రీశ్రీశ్రీ హజరత్ షా హుస్సేన్ వలి స్వామివారి సంవత్సరీకం (బర్సీ) ఉత్సవాలు బుధవారం ప్రొద్దుటూరు పట్టణంలోని బంగారు బజార్‌లో ఉన్న దర్గా వద్ద భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం నమాజ్ అనంతరం ఖురాన్ పఠనం జరిపి, అనంతరం అంజుమన్ కమిటీ సభ్యులు మరియు భక్తులు స్వామివారికి పూల దుప్పటి, గంధం సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తరువాత దువా కార్యక్రమం నిర్వహించి సమాజ శాంతి, సౌభ్రాతృత్వం, ప్రజల సంక్షేమం కోసం ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమం ఏపీ స్టేట్ షేక్ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మరియు ప్రొద్దుటూరు అంజుమన్ అహ్లే ఇస్లాం కమిటీ అధ్యక్షులు డా. వి.ఎస్. ముక్తియార్ ఆధ్వర్యంలో జరిగింది.కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బొల్లారం భాషా, కమిటీ కార్యదర్శి ఖురేషి ఇలియాస్, అంజుమన్ సభ్యులు కె. ఖలీల్ భాషా తదితరులు పాల్గొన్నారు. వందలాది మంది భక్తులు హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ వేడుకలు భక్తులకు విశేష ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించాయి.



# 16 కోట్ల కోసం పసిప్రాణం పోరాటం..!

- అరుదైన ఎస్ఎంఏ వ్యాధితో 13 నెలల చిన్నారి వర్షిత్
- చికిత్సకు భారీ ఖర్చు..దాతల సహాయం కోసం తల్లిదండ్రుల విజ్ఞప్తి





**ప్రొద్దుటూరు మన జనప్రగతి జూన్ 24:**-ప్రొద్దుటూరుకు చెందిన 13 నెలల చిన్నారి వర్షిత్ అరుదైన స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ (ఎస్ఎంఏ) టైప్-2 వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ వ్యాధికి అవసరమైన ప్రత్యేక చికిత్స కోసం సుమారు రూ.16 కోట్ల వ్యయం అవుతుందని వైద్యులు సూచించడంతో బాలుడి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అంత భారీ మొత్తాన్ని సమకూర్చుకునే ఆర్థిక స్థోమత లేకపోవడంతో తమ కుమారుడి ప్రాణాలను కాపాడాలని ప్రజలను వేడుకుంటున్నారు.చిన్నారి చికిత్స కోసం ప్రొద్దుటూరులోని పలువురు సామాజిక మాధ్యమాల ప్రతినిధులు, సేవా సంస్థల సభ్యులు, యువకులు ముందుకు వచ్చి నిధుల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పట్టణంలోని వ్యాపార సంస్థలు, దుకాణాలు, వివిధ వర్గాల ప్రజలను కలిసి విరాళాలు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పసికందు ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయం చేయాలని కోరుతున్నారు.ఈ సందర్భంగా బాలుడి తల్లిదండ్రులు మాట్లాడుతూ, తమ కుమారుడి ఆరోగ్య పరిస్థితిని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే దాతలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, సేవాభావం కలిగిన ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి వర్షిత్ చికిత్సకు తోడ్పడాలని కోరారు.పసిప్రాణాన్ని కాపాడేందుకు సమాజం మొత్తం అండగా నిలవాల్సిన అవసరం ఉందని, చిన్న సహాయం కూడా చిన్నారి జీవితానికి పెద్ద భరోసాగా మారుతుందని వారు భావోద్వేగంగా విజ్ఞప్తి చేశారు.

# పదిలో రాష్ట్ర స్థాయి ఫలితాలు సాధించిన విద్యార్థినులకు ఘన సన్మానము




**రామాపురం మన జనప్రగతి జూన్ 24:**-నీలకంఠరావుపేట జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో గత పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో స్టేట్ ర్యాంకు సాధించిన మరియు పాఠశాలలో మొదటి రెండు మూడవ స్థానాలు సాధించిన విద్యార్థినులకు సన్మాన కార్యక్రమము జరిగినది. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు వనజా రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు విద్యార్థులకు మోమెంటోలు,మెడల్స్ ,బ్యాగులు మరియు నగదు బహుమతులు అందజేయడం జరిగినది. సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులు,ప్రాథమిక పాఠశాల ఎల్ ఎఫ్ ఎల్ ప్రధానోపాధ్యాయు,ఓబుల్ రెడ్డి మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ఎస్.అమానుల్లా మాట్లాడుతూ...ప్రభుత్వ పాఠశాలలో చదివి రాష్ట్రము లోని ఉర్దూ పాఠశాలల్లో రాష్ట్రస్థాయి మూడవ ర్యాంకు సాధించడము గొప్ప విషయమని తెలియజేశారు ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన జరుగుతుందని తల్లిదండ్రులకు తెలియజేశారు,మరీన్నత ఉన్నత శిఖరాలకు ఎదగాలని పిల్లలకు సూచించారు మెడికల్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీవాణి మేడం తమ తరఫు నుంచి విద్యార్థినులకు బ్యాగులు అందజేయడం జరిగింది సమావేశంలో ప్రధాన ఉపాధ్యాయుడు విద్యార్థి విద్యార్థినులకు మరియు తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలో జరిగే ప్రభుత్వం పథకాలు ఎస్.ఆర్.కె.వి.ఎం కిట్లు గురించి గుర్తుచేస్తూ అడ్మిషన్లు ప్రభుత్వ పాఠశాలలోనే చేయించాలని కోరడం జరిగింది. ఈ సన్మాన సభ లో ఉపాధ్యాయులు జాఫర్,సునీర్ సార్,మజహర్,మహబూబ్ బాష, గౌస్పీర్,మధుర వాణి,పిఈటి వాణి పాల్గొన్నారు.

# డీఎస్సీ2003 ఉద్యోగులకు ఓపీఎస్ అమలు చారిత్రాత్మక నిర్ణయం: కొండూరు శ్రీనివాసరాజు



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి జూన్ 24:**-2003 డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా నియమితులైన 10,715 మంది ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) వర్తింపజేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు పేర్కొన్నారు. ఈ నిర్ణయంపై రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.బుధవారం రాయచోటి సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న ఈ నిర్ణయం వేలాది ఉద్యోగుల కుటుంబాలకు భవిష్యత్ భరోసాను కల్పిస్తుందని అన్నారు. ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న డీఎస్సీ2003 ఉద్యోగుల న్యాయమైన డిమాండ్‌కు ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం అభినందనీయమని పేర్కొన్నారు.అలాగే ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, సొసైటీలలో పనిచేస్తున్న సుమారు 15 వేల మంది ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కూడా స్వాగతించ దగినదని అన్నారు. ఈ నిర్ణయం ద్వారా అనుభవజ్ఞులైన ఉద్యోగుల సేవలను మరింత కాలం ప్రజలకు అందించే అవకాశం లభిస్తుందని తెలిపారు.డీఎస్సీ2003 ఉద్యోగులకు ఓపీఎస్ సాధనలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ సభ్యులు, మంత్రివర్గ సభ్యులు, అలాగే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవిరావు, భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, పేరాబత్తుల రాజశేఖర్‌ల నిరంతర కృషి, చొరవ కీలక పాత్ర పోషించాయని శ్రీనివాసరాజు పేర్కొన్నారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు నల్లమల రామాంజులు, రాయచోటి మండల అధ్యక్షుడు నాగరాజు, సంఘ నాయకులు మడితాటి నరసింహారెడ్డి, తిరుపతి శ్రీనివాస్, మహమ్మద్ ఇలియాస్, వైసీ రెడ్డప్పరెడ్డి, కలీముల్లా తదితరులు పాల్గొన్నారు.

# కడప పార్లమెంటు కమిటీలో దాసరి రవిశంకర్‌కు అవకాశం

- వేంపల్లె జనసేన నాయకుడికి పార్టీ గుర్తింపు
- పార్టీ అభివృద్ధే లక్ష్యమని స్పష్టం చేసిన రవిశంకర్



**వేంపల్లె మన జనప్రగతి జూన్ 24:**-కడప పార్లమెంటు సమాచార సేకరణ కమిటీ సభ్యుడిగా వేంపల్లెకు చెందిన జనసేన పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ దాసరి రవిశంకర్ నియమితులయ్యారు. ఈ మేరకు జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి బుధవారం అధికారిక నియామక పత్రాలు అందాయి.ఈ సందర్భంగా డాక్టర్ దాసరి రవిశంకర్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతాయుతమైన పదవిని అప్పగించిన జనసేన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి, బలోపేతం కోసం సాయశక్తులా కృషి చేస్తానని, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిరంతరం శ్రమిస్తానని పేర్కొన్నారు.అలాగే పార్టీ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో సమాచార సేకరణ కమిటీ కీలక పాత్ర పోషిస్తుందని, తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. ఈ పదవి దక్కేందుకు సహకరించిన జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, కడప పార్లమెంటు పరిశీలకుడు సి.మధుసూదన్ రెడ్డి, జిల్లా నాయకులు, పార్టీ కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.డాక్టర్ దాసరి రవిశంకర్ నియామకంపై జనసేన శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.

# అన్ని కులాలు,మతాల ఐక్యవేదికే జనసేన

- ప్రతిపక్షాల విమర్శలను ఖండించిన గోసల ఆంజనేయులు
- ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని సూచన




**వేంపల్లి మన జనప్రగతి జూన్ 24:**-జనసేన పార్టీ అన్ని కులాలు,మతాలు, ప్రాంతాలకు చెందిన ప్రజల ఐక్యవేదికగా ఏర్పాటైందని, దానిని ఒకే సామాజిక వర్గానికి చెందిన పార్టీగా చిత్రీకరించడం సరైన విధానం కాదని జనసేన నాయకుడు గోసల ఆంజనేయులు అన్నారు.బుధవారం వేంపల్లిలో ఆయన మాట్లాడుతూ, జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతిని లక్ష్యంగా చేసుకుని పనిచేస్తోందని పేర్కొన్నారు. కొందరు ప్రతిపక్ష నాయకులు జనసేనను కేవలం కాపు సామాజిక వర్గానికి చెందిన పార్టీగా ప్రచారం చేయడం రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నదేనని విమర్శించారు.జనసేన పార్టీ కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా సమాజంలోని ప్రతి వర్గానికి అండగా నిలుస్తోందని తెలిపారు.రాష్ట్రంలో కుల రాజకీయాలు పెరగడం వల్ల సమాజంలో విభేదాలు ఏర్పడుతున్నాయని, ఇది అభివృద్ధికి ఏమాత్రం మంచిది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలను కులాల పేరుతో విడదీసే రాజకీయాలకు స్వస్తి పలికి, సమగ్ర అభివృద్ధి కోసం రాజకీయ పార్టీలు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిఠాపురం నియోజకవర్గం నుంచి పోటీ చేయడంపై కొందరు నాయకులు చేస్తున్న వ్యాఖ్యలను ఆయన ఖండించారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి దేశంలోని ఏ నియోజకవర్గం నుంచైనా ఎన్నికల్లో పోటీ చేసే హక్కు కల్పించిందని గుర్తు చేశారు. అలాంటి ప్రాథమిక హక్కులను కూడా రాజకీయ విమర్శల కోసం వాడుకోవడం బాధాకరమని అన్నారు.ఇకనైనా ప్రతిపక్ష నాయకులు వ్యక్తిగత విమర్శలు, ప్రాంతీయ వ్యాఖ్యలు పక్కనబెట్టి ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం, సామాజిక ఐక్యతే ప్రతి రాజకీయ పార్టీ ప్రధాన లక్ష్యంగా ఉండాలని గోసల ఆంజనేయులు పేర్కొన్నారు.

# వైఎస్ జగన్‌ను కలిసిన 'స్నేహిత అమృత హస్తం' ప్రతినిధులు

- నూతన భవన నిర్మాణానికి సహాయం చేయాలని విజ్ఞప్తి





**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూన్ 24:**సామాజిక సేవా కార్యక్రమాలకు అంకితభావంతో సేవలందిస్తున్న స్నేహిత అమృత హస్తం సేవాసమితి నూతన భవన నిర్మాణ పనులకు సహకారం అందించాలని మాజీ ముఖ్యమంత్రి వైయస్.జగన్ మోహన్ రెడ్డిను సేవాసమితి అధ్యక్షులు మొమ్మెల రాజు, ప్రతినిధులు గురు ప్రతాప్ రెడ్డి, చాంద్ బాషా కలిసి విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,సేవాసమితి నూతన భవన గ్రౌండ్ ఫ్లోర్ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని,మిగిలిన రెండు అంతస్తుల నిర్మాణానికి ఆర్థిక సహాయం అవసరమని తెలిపారు.గత అనేక సంవత్సరాలుగా సేవాసమితి ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఉచిత కోచింగ్ లు,యువతకు మరియు మహిళలకు ఉపాధి శిక్షణ,రక్తదాన శిబిరాలు, నేత్రదాన అవగాహన కార్యక్రమాలు,కోవిడ్ వంటి విపత్తుల సమయంలో సహాయక చర్యలు,పేదలకు నిత్యావసర వస్తువుల పంపిణీ,వైద్య సహాయం తదితర సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.ఈ సేవలను మరింత విస్తృత స్థాయిలో ప్రజలకు అందించాలనే లక్ష్యంతో నూతన భవన నిర్మాణాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు.భవన నిర్మాణ పనులు పూర్తి కావడానికి గణనీయమైన నిధులు అవసరమవుతున్నందున ప్రజాప్రతినిధులు,దాతలు, సేవాభావం కలిగిన వ్యక్తులు ముందుకు వచ్చి సహకరించాలని కోరారు.ఈ మేరకు భవన నిర్మాణ ప్రణాళికతో పాటు సేవాసమితి నిర్వహిస్తున్న కార్యక్రమాల వివరాలను మాజీ ముఖ్యమంత్రి వైయస్.జగన్ మోహన్ రెడ్డి మరియు వై యస్ అవినాష్ రెడ్డి ల దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రాన్ని సమర్పించినట్లు తెలిపారు.నూతన భవనం పూర్తయితే విద్యార్థులు,మహిళలు, యువతకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు అనాథలు,నిరుపేదలు, రోగులు మరియు అత్యవసర పరిస్థితుల్లో సహాయం అవసరమైన వారికి మరింత సమర్థవంతంగా సేవలు అందించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఈ భవనం సామాజిక సేవా కార్యక్రమాలకు కేంద్రంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సేవాసమితి ఉచిత విద్య ఉపాధ్యాయ సభ్యులు గురుప్రతాప్ రెడ్డి, సేవాసమితి సభ్యులు చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనం నాణ్యత లోపిస్తే చర్యలు:ఎంఈఓ అరుణ



**సిద్ధవటం మన జనప్రగతి జూన్ 24:**-పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతలో లోపాలు ఉంటే సంబంధిత వారిపై చర్యలు తీసుకుంటామని మండల విద్యాశాఖ అధికారి అరుణ హెచ్చరించారు. బుధవారం సిద్ధవటం మండల కేంద్రంలోని తన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల ప్రకారమే ఫీజులు వసూలు చేయాలని సూచించారు.అధిక ఫీజులు వసూలు చేస్తే విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతను క్రమం తప్పకుండా పరిశీలిస్తున్నామని, విద్యార్థులు పాఠశాలలో క్రమశిక్షణతో మెలగాలని ఎంఈఓ అరుణ సూచించారు.

# ఉపాధి పనులకు కూలీలు తప్పనిసరిగా హాజరు కావాలి: ఏపీవో నరసింహులు



**సిద్ధవటం మన జనప్రగతి జూన్ 24:**-
మండలంలోని మాచుపల్లి గ్రామంలో జరుగుతున్న నీటి నిలువ గుంతల పనులను ఏపీవో నరసింహులు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి కూలీల హాజరు నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపడుతున్న నీటి నిలువ గుంతల వల్ల వర్షపు నీరు నిల్వ ఉండి భూగర్భ జలాలు పెరుగుతాయని, రైతుల బోర్లకు నీటి లభ్యత మెరుగుపడుతుందని తెలిపారు. ప్రతి జాబ్ కార్డు కలిగిన కూలీ తప్పనిసరిగా ఉపాధి పనులకు హాజరు కావాలని సూచించారు. ప్రస్తుతం 56 మంది కూలీలు పనులు చేస్తున్నారని, పనులు చేసిన కూలీలకు నగదు చెల్లింపులు జరిగాయని పేర్కొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ సూచించిన ప్రదేశాల్లో కొలతల ప్రకారం పనులు చేస్తే కూలీల ఖాతాల్లో తగిన వేతనం జమ అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ శశికళ, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# చేతి పంపు బోరు పనిచేయక ఇబ్బందులు..

- మరమ్మతులు చేయాలని గ్రామస్తుల విజ్ఞప్తి



**సిద్ధవటం మన జనప్రగతి జూన్ 24:**-మండలంలోని మూలపల్లి గ్రామం రాముని గుడి వద్ద ఉన్న చేతి పంపు బోరు గత పది రోజులుగా పనిచేయకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం గ్రామస్తులు మాట్లాడుతూ చేతి పంపు మరమ్మతులు చేపట్టి తాగునీటి సమస్య పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గురు ప్రసాద్‌ను వివరణ కోరగా మూలపల్లి గ్రామంలోని చేతి పంపు బోరు మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి అభినందన సత్కారం

**హైదరాబాద్ మన జనప్రగతి జూన్ 24:**- త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనా రెడ్డి తన పర్యటనలో భాగంగా హైదరాబాద్ నగరానికి వచ్చిన సందర్భంగా బీజేపీ సీనియర్ నేత వై. కృష్ణ, బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్.లక్ష్మణ్ రావు ల నేతృత్వంలో పలువురు బీజేపీ నేతలు, కార్యకర్తలు బుధవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు జ్ఞాపికను బహుకరించారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా ప్రయోజన పథకాలు, సామాజిక అభివృద్ధి, తదితర అంశాలపై వారు గవర్నర్ తో చర్చించారు.



మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా పంతం | అభివృద్ధి మా లక్ష్యం
25 - 06 - 2026

## మొహరం వేడుకలు ప్రశాంతంగా జరుపుకోండి: సబ్ ఇన్స్పెక్టర్ నబిరసుల్



**బొమ్మనహాళ్ మన జనప్రగతి జూన్ 24:**–బొమ్మనహల్ మండల వ్యాప్తంగా మొహరం వేడుకలు ప్రశాంతంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని మండల సబ్ ఇన్స్పెక్టర్ నబిరసుల్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు,ఈ సందర్భంగా ఎస్సై నబిరసుల్ మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాలలో మొహరం ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో జరగాలని కోరారు,వేడుకలు సందర్భంగా ఏ గ్రామంలో కూడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు,యువత బాధ్యతాయుతంగా వ్యవహరించి పరస్పర సామరస్యాన్ని కాపాడాలని,అదేవిధంగా పోలీసుశాఖ జారీ చేసే సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.అలాగే అగ్నిగుండంలో పచ్చని చెట్లు నరికి వేయరాదని,ఎండిన చెట్లు మాత్రమే వేయాలని కోరారు,అన్ని వర్గాల ప్రజలు పరస్పర సహకారంతో మొహరం వేడుకలు విజయవంతంగా నిర్వహించి బొమ్మనహాల్ మండలంలో శాంతిభద్రతలను పరిరక్షించాలని మండల సబ్ ఇన్స్పెక్టర్ నబిరసుల్ కోరారు.


## నిబంధనలు పాటించని ఎరువుల డీలర్ల లైసెన్సులు రద్దు

**- జిల్లా వ్యవసాయ అధికారి హెచ్చరిక**



**సింహాద్రిపురం మన జనప్రగతి జూన్ 24:**మండలంలోని ఎరువుల దుకాణాల డీలర్ల సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ముఖ్య ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ప్రతి ఎరువుల డీలర్ తప్పనిసరిగా రైతుకు బిల్లు ఇవ్వాలని,నాణ్యమైన ఎరువులను మాత్రమే విక్రయించాలని స్పష్టం చేశారు.ప్రభుత్వ నిబంధనలను పాటించని వారి లైసెన్సులను రద్దు చేయడం జరుగుతుందని ఆయన తీవ్రంగా హెచ్చరించారు.జిల్లా వ్యవసాయ అధికారి ఎం.సుబ్రహ్మణ్యేశ్వర రావు ఏ.డి.ఏ.ఎం.రామమోహన్ రెడ్డి,ఏ.ఓ.రామంజులు రెడ్డి మరియు స్థానిక ఎరువుల డీలర్లు తదితరులు పాల్గొన్నారు.


## దేవపట్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠలో శ్రీకాంత్ రెడ్డి



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి జూన్ 24:**–సంబేపల్లె మండలం దేవపట్ల గ్రామంలో దేవపట్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు, రైతులు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. జగన్ ప్రభుత్వ హయాంలో ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. సంబేపల్లె మండలంలోని పలు ఆలయాలకు సీజీఎఫ్, శ్రీవాణి ట్రస్ట్ ద్వారా కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. దేవపట్లమ్మ ఆలయ నిర్మాణానికి చేసిన కృషికి గ్రామస్తులు, భక్తులు శ్రీకాంత్ రెడ్డిని సత్కరించి అభినందించారు.

## రాయచోటి ట్రాఫిక్ సీఐగా ఎన్.శేఖర్ బాధ్యతల స్వీకరణ

**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి జూన్ 24:**– రాయచోటి ట్రాఫిక్ విభాగ నూతన సీఐగా బుధవారం ఎన్.శేఖర్ బాధ్యతలు స్వీకరించారు.గతంలో మదనపల్లి తాలూకా సీఐగా సేవలందించి ప్రజల మన్ననలు పొందారు. అనంతపురం రూరల్ సీఐగా కూడా సమర్థవంతంగా విధులు నిర్వహించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ట్రాఫిక్ నియంత్రణ, రహదారి భద్రతకు ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. ఆయన నియామకంపై పోలీసు సిబ్బంది,స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



## వేగం కాదు..ప్రమాదమే వెంటాడింది..!

- ఇంటికి వస్తూ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన యువకుడు
- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు





**వేముల మన జనప్రగతి జూన్ 24:** విధులు ముగించుకుని ఇంటికి బయలుదేరిన ఓ యువకుడిని ప్రమాదం వెంటాడింది.వేముల మండలంలోని యూసీఐఎల్ సమీప తుమ్మలపల్లి గ్రామం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సైదాపురం గ్రామానికి చెందిన వంశీధర్‌రెడ్డి (26) మృతిచెందగా,మరో ముగ్గురికి తీవ్రంగా గాయపడ్డారు.ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది.అయితే స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాల ఇలా ఉన్నాయి వంశీధర్‌రెడ్డి ఎస్ఎంఎస్ కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు.విధులు ముగించు కుని సహచరులతో కలిసి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు.తుమ్మలపల్లి గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న మరో బైకును తప్పించే ప్రయత్నంలో రెండు వాహనాల రైడర్లు ఒక్కసారిగా బ్రేకులు వేయడంతో బైకులు అదుపుతప్పి రోడ్డుపై జారిపడ్డాయి.ప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉండటంతో వంశీధర్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు.అతనితో ప్రయాణిస్తున్న వేణుమాధవ్‌కు తీవ్ర గాయాలు కాగా పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.మరో బైకుపై ప్రయాణిస్తున్న రమేష్,వంశీలకు కూడా తీవ్ర గాయాలయ్యాయి.స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.యువకుడి అకాల మరణంతో సైదాపురం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు అందరినీ కలచివేశాయి.గ్రామస్థులు మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు

## అంగన్వాడీ కేంద్రాల్లో ఇండక్షన్ స్టవ్‌ల వినియోగం తప్పనిసరి

**- కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశాలు**



**మదనపల్లె మన జనప్రగతి జూన్ 24:**–అన్నమయ్య జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందజేసిన ఇండక్షన్ స్టవ్‌లను తప్పనిసరిగా వినియోగించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. మదనపల్లె కలెక్టరేట్‌లో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో రామసముద్రం మండల అంగన్వాడీ కార్యకర్తలకు ఇండక్షన్ స్టవ్‌లు, వంట పాత్రలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మొత్తం 1,792 అంగన్వాడీ కేంద్రాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక వంట సౌకర్యాల కల్పన కోసం ఇండక్షన్ స్టవ్‌లు, అవసరమైన వంట పాత్రలను అందించిందన్నారు. వీటి వినియోగంతో వంట ప్రక్రియ వేగవంతం కావడంతో పాటు సమయం, శ్రమ కూడా ఆదా అవుతాయని తెలిపారు.అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో ఇండక్షన్ స్టవ్‌ల వినియోగం సక్రమంగా జరుగుతున్నదీ లేదీ సీడీపీవోలు, సూపర్వైజర్లు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు నాణ్యమైన సేవలు, మెరుగైన సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఆయన పేర్కొన్నారు.కార్యక్రమంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మోపూరు భైరవేశ్వర ఆలయ హుండీ లెక్కింపు పూర్తి

**- రూ.5.12 లక్షల ఆదాయం**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూన్ 24:**–ప్రముఖ పుణ్యక్షేత్రమైన మోపూరు భైరవేశ్వర స్వామి దేవాలయంలో భక్తుల విరాళాల (హుండీ) లెక్కింపు కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో ఘనంగా నిర్వహించబడింది. నల్లచెరువుపల్లి,కొండ్రెడ్డిపల్లి, నారేపల్లి గ్రామాల సమీపంలో వెలసిన ఈ ఆలయానికి భక్తులు సమర్పించిన కానుకలను అధికారులు పారదర్శకంగా లెక్కించారు.పారదర్శకంగా లెక్కింపు ప్రక్రియ ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ రమణారెడ్డి,ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి,ఈఓ రమణ,ఆలయ కమిటీ సభ్యులు మరియు అర్చకులు పాల్గొన్నారు.అధికారుల సమక్షంలో హుండీలను తెరిచి, భక్తులు సమర్పించిన నగదును లెక్కించగా మొత్తం రూ.5,12,317/- (ఐదు లక్షల పన్నెండు వేల మూడు వందల పదిహేడు రూపాయలు) ఆదాయం వచ్చినట్లు అధికారులు అధికారికంగా వెల్లడించారు.భక్తుల విశ్వాసం,ఆదరణతో మోపూరు భైరవేశ్వర స్వామి ఆలయానికి రోజురోజుకు ఆదాయం పెరుగుతోందని ఆలయ అభివృద్ధికి,నిత్య పూజా కార్యక్రమాల నిర్వహణకు భక్తులు అందిస్తున్న ఆర్థిక సహకారానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.భక్తులు భవిష్యత్తులోనూ ఇదే విధమైన భక్తిశ్రద్ధలతో ఆలయ అభివృద్ధికి తోడ్పడాలని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా,అత్యంత పారదర్శకంగా మరియు ప్రశాంత వాతావరణంలో ఈ హుండీ లెక్కింపు ప్రక్రియ ముగిసింది.ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది,కమిటీ సభ్యులు మరియు పలువురు భక్తులు పాల్గొన్నారు.

## కార్యకర్తలే పార్టీ బలం..ఎస్.ఐ.ఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- మదనపల్లె పార్లమెంట్ టీడీపీ కార్యాలయంలో క్యాడర్ సమావేశం
- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకుల పిలుపు




**అన్నమయ్య జిల్లా ప్రతినిధి మన జనప్రగతి జూన్ 24:**–తెలుగుదేశం పార్టీ బలోపేతం,ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల విస్తరణ లక్ష్యంగా మదనపల్లె పార్లమెంట్ టీడీపీ కార్యాలయంలో బుధవారం నెలవారీ క్యాడర్ సమావేశం, ఎస్.వై.ఆర్ కార్యక్రమం నిర్వహించారు.రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా, రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పఠాన్ ఖాదర్ ఖాన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ...ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు.చమర్తి జగన్ మోహన్ రాజు మాట్లాడుతూ..కార్యకర్తలే పార్టీకి అసలైన బలమని పేర్కొంటూ ఎస్.ఐ.ఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు.పఠాన్ ఖాదర్ ఖాన్ మాట్లాడుతూ, పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించాలని అన్నారు.సుగవాసి ప్రసాద్ బాబు మాట్లాడుతూ, కార్యకర్తల కష్టమే పార్టీ విజయాలకు పునాదని పేర్కొన్నారు. "కార్యకర్తే పార్టీకి వెన్నెముక.. ప్రజాసేవే తెలుగుదేశం పార్టీ లక్ష్యం" అని ఆయన అన్నారు. పార్టీ బలోపేతానికి అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

## అంబులెన్స్‌కు దారి ఇచ్చి మానవత్వాన్ని చాటుకున్న వైఎస్ జగన్





**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూన్ 24:**అంబులెన్స్ సైరన్ వినపడగానే తన కాన్వాయ్‌ను పక్కకు నిలిపి,అత్యవసర వైద్యం కోసం వెళ్తున్న బాధితులకు దారి ఇచ్చి మాజీ ముఖ్యమంత్రి,వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తన మానవత్వాన్ని చాటుకున్నారు.వేముల మండలం భూమయ్యగారిపల్లిలో జరిగిన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాల్లో పాల్గొన్న వైఎస్ జగన్,అనంతరం పులివెందులకు తిరుగుపయనమయ్యారు. మార్గమధ్యంలో గురుకుల పాఠశాల సమీపంలో స్థానిక ప్రజలతో,పార్టీ నాయకులతో ఆయన మాట్లాడుతున్నారు.వేముల మండలం యు సి ఎల్ వద్ద రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా,మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.క్షతగాత్రులను అత్యవసర చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో పులివెందుల ఆసుపత్రికి తరలిస్తున్నారు.విషయం గమనించిన వైఎస్ జగన్ క్షణం కూడా ఆలస్యం చేయకుండా, వెంటనే తన కాన్వాయ్‌ను రోడ్డు పక్కకు నిలిపివేయాలని భద్రతా సిబ్బందిని ఆదేశించారు.ట్రాఫిక్‌ను క్లియర్ చేయించి అంబులెన్స్ వేగంగా వెళ్లేందుకు దారి కల్పించారు.ఎంతటి విఐపి పర్యటన అయినా ప్రాణం కంటే ఏదీ ముఖ్యం కాదు అని నిరూపిస్తూ వైఎస్ జగన్ వ్యవహరించిన తీరుపై స్థానికులు మరియు సోషల్ మీడియా వేదికగా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మోడల్ పాఠశాలల అభివృద్ధి పనులు చక్కటి ప్రణాళికతో చేపట్టాలి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి




**కడప మన జనప్రగతి జూన్ 24:** జిల్లాలో సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టు ద్వారా ఎంపిక చేసిన పాఠశాలల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా, నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన.. సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో జిల్లాలోని ఎంపిక చేసిన పాఠశాలల్లో చేపట్టనున్న పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మోడల్ పాఠశాలల అభివృద్ధి పనులకు సంబంధించి సమగ్ర ప్రణాళిక నివేదికలను సిద్ధం చేసి పనులను చేపట్టాలని సూచించారు. జిల్లాలో ఎంపిక చేసిన 396 పాఠశాలల్లో అభివృద్ధి పనులన్నీ మండల విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణలో నిర్వహించాలని తెలిపారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పురపాలక మరియు గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ శాఖల అధికారుల సమన్వయంతో పనులను అమలు చేయాలన్నారు.మోడల్ పాఠశాలలుగా గుర్తింపు పొందే పాఠశాలల్లో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉత్తమ మోడల్ పాఠశాలలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన వసతులు, అభివృద్ధి అవసరాలపై నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు.మండల స్థాయి కమిటీలలో ఎంఈఓ-1, ఎంఈఓ-2లు, ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ సిబ్బంది సమన్వయంతో బాధ్యతాయుతంగా పనులు నిర్వహించాలని తెలిపారు. రెండో దశ "మన బడి మన భవిష్యత్తు" కార్యక్రమంలో పెండింగ్‌లో ఉన్న నిధులను సమర్థవంతంగా వినియోగించేలా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, మరమ్మతు పనులను సకాలంలో పూర్తి చేసి నాణ్యతను కాపాడాలని అధికారులకు సూచించారు.సమావేశంలో సమగ్ర శిక్ష అభియాన్ అదనపు పథక సమన్వయకర్త అనురాధ, గ్రామీణ నీటి సరఫరా విభాగం ప్రధాన ఇంజినీరు ఏడుకొండలు, కడప పురపాలక సంస్థ ప్రధాన ఇంజినీరు చెన్నకేశవరెడ్డి, ఉప జిల్లా వ్యవసాయ అధికారి రాజగోపాల్ రెడ్డి, ఎంఈఓలు, మున్సిపల్, పీఆర్ ఇంజినీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం



# కుల పిచ్చి పార్టీలను తరిమి కొట్టాలి: మాజీ ఎంపీ డాక్టర్ తులసి రెడ్డి



**వేంపల్లె మన జనప్రగతి జూన్ 24:-**రాష్ట్రంలో ఇటీవల కాలంలో రాజకీయ కుల పిచ్చి ఎక్కువైందని, అది పతాక స్థాయికి చేరడం శోచనీయమని,దురదృష్టకరమని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. వేంపల్లిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు ప్రాంతీయ పార్టీలైన వైకాపా, తెలుగుదేశం,జనసేన పార్టీలు కుల రాజకీయాలను ప్రోత్సహించడం గర్హనీయమన్నారు. ఏ రాజకీయ పార్టీ అయినా అందరి పార్టీగా ఉండాలి . ఏ రాజకీయ నాయకుడైనా అందరివాడుగా ఉండాలన్నారు . కానీ ఇటీవల కాలంలో రాష్ట్రంలోప్రాంతీయ పార్టీలు కొందరి పార్టీలుగా, ప్రాంతీయ పార్టీల నాయకులు కొందరి నాయకులుగా తయారవుతుండడం శోచనీయ మన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ కులరహిత సమాజాన్ని ఆశించాడని . మహాకవి వేమన కుల వ్యవస్థను తన కవితా ఖడ్గంతో చీల్చి చెండాడడని గుర్తు చేశారు. మంచి చెడ్డలు రెండు కులములే,మంచి అన్నది మాల అయితే నేను మాలనవుతానన్నాడు నాటి మహాకవి గురజాడ.దానవీరశూరకర్ణ సినిమాలో కుల వ్యవస్థ పై స్వర్గీయ ఎన్టీఆర్ వీర విహారం చేశాడని ఆయన గుర్తు చేశారు. బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే – నిండారా రాజు నిద్రించు నిద్రయునొకటే – అండనే బంటు నిద్ర అదియునూ ఒకటే, మెండైన బ్రాహ్మణుడు మెట్టు భూమి ఒకటే – చండాలుడుండేటి సరి భూమి ఒకటే అని 600 సంవత్సరాల క్రితమే కుల వ్యవస్థను వ్యతిరేకించిన కవి అన్నమయ్య అని ఆయన పేర్కొన్నారు .ఒకవైపు ఆధునిక మానవుడు అంగారక గ్రహం మీద అడుగు పెట్టాలని ప్రయత్నం చేస్తూ మరొకవైపు సంకుచిత మనస్తత్వంతో కులాల కుంపటి రాజేయడం అత్యంత శోచనీయమన్నారు . ఇప్పటికైనా రాష్ట్ర ప్రజలు కులాల కుంపట్లు రాజేస్తున్న ప్రాంతీయ పార్టీలను తరిమికొట్టి అందరి పార్టీ అయిన కాంగ్రెస్ పార్టీని ఆదరించవలసిందిగా తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# వచ్చేది మన ప్రభుత్వమే..

**కార్యకర్తల సంక్షేమమే నా తొలి కర్తవ్యం**

**పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తాం**

**పులివెందుల పర్యటనలో వైఎస్ జగన్ హామీ**





**పులివెందుల మన జనప్రగతి జూన్ 24:-** వచ్చేది తమ ప్రభుత్వమేనని, అధికారంలోకి వచ్చిన వెంటనే పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. కార్యకర్తల సంక్షేమమే తన తొలి కర్తవ్యం అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. పులివెందుల బుధవారం రెండో రోజు పర్యటనలో పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. జిల్లా లోని నాయకులు కార్యకర్తలతో పాటు జిల్లా చుట్టుపక్కల జిల్లాల నుంచి భారీగా వారి సమస్యలు తెలుపు కోవడానికి వచ్చారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరిని పేరుపేరునా ఆప్యాయంగా పలకరించి వారి కష్టాలను తెలుసుకున్నారు. కూటమి నాయకుల అరాచకాలతో నష్టపోయిన ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రధానంగా కార్యకర్తల కష్టసుఖాలు అడుగుతూ ఎవరికి ఏ ఆపద వచ్చినా అండగా ఉంటానని ధైర్యమిచ్చారు. కూటమి ప్రభుత్వం చాలా దారుణంగా వ్యవహరిస్తోందని, అరాచక పాలన సాగిస్తోందని, కూటమి నాయకులు దాడులు చేస్తున్నారని, అలాగే అక్రమ కేసులు పెడుతున్నారని పలువురు వైఎస్సార్సీపీ నేతలు, కార్యకర్తలు వైయస్ జగన్ వద్ద వాపోయారు. దీనికి ఆయన స్పందిస్తూ నేను ఉన్న అంటూ భరోసా కల్పించారు. టీడీపీ ఆరాచకాలను పార్టీ శ్రేణులు ధైర్యంగా ఎదుర్కోవాలని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరూ పోరాట పంథాను ఎంచుకుని ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. క్యాంపు కార్యాలయంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు, వివిధ వర్గాలకు చెందిన ప్రజలు, సమస్యల పరిష్కారం కోసం వచ్చిన బాధితుల నుంచి వినతులను స్వీకరించారు. కడప పార్లమెంటు సభ్యుడు వైయస్ అవినాష్ రెడ్డితో మాట్లాడి పరిష్కారం చూపాలని సూచించారు. రాత్రి పట్టణంలోనివాసములో బస చేస్తారు. గురువారం ఉదయం 8 గంటల కు పులివెందుల నుంచి హెలికాప్టర్ ద్వారా బెంగళూరుకు బయలుదేరి వెళ్తారు.

**రోడ్డు పనులు ప్రారంభించిన జగన్**

రూ .1.50 కోట్ల ఎంపీ నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్లను ప్రారంభించారు.. రూ .50 లక్షల వ్యయంతో పులివెందుల పట్టణం లోని స్థానిక భాకరాపురం లోని త్రిలోక్ మార్ట్ నుంచి శ్రీరాముని గుడి వరకు సిసి రోడ్డు , -రూ . 50 లక్షల వ్యయంతో పులివెందుల పట్టణం లోని స్థానిక 31 వ వార్డు వైయస్సార్ కాలనీ నందు న్యాక్ బిల్డింగ్ ప్రక్కన ఉన్న ప్రధాన మార్గానికి సిసి రోడ్డు ,రూ . 50 లక్షల వ్యయంతో పులివెందుల పట్టణం లోని 14,15 వ వార్డు యర్రగుడి పల్లి లోని గరుడాల బ్రిడ్జి ప్రక్కన రేషన్ డీలర్ షాప్ మరియు సీఎస్ఐ చర్చి ఎదురుగా ఉన్న రోడ్డు ప్రారంభించారు.

# బీసీలను అగ్రపథాన నిలబెడతాం: మంత్రి సవిత



**అమరావతి మన జనప్రగతి జూన్ 24:-** రాష్ట్రంలో బీసీల రాజకీయ, ఆర్థిక, సామాజిక అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యమని బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. సచివాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, బీసీ సంక్షేమానికి గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ నిధులు కేటాయించామని చెప్పారు.రాష్ట్రంలో ప్రస్తుతం 109 బీసీ గురుకులాలు ఉన్నాయని, మరో 10 గురుకులాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రూ.500 కోట్లతో ఎంజేపీ గురుకులాలకు శాశ్వత భవనాలు నిర్మిస్తామని, ఐఐటీ, నీట్ ప్రవేశాల కోసం ప్రత్యేక శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.బీసీ హాస్టళ్లలో మెరుగైన వసతి, ఆహార సౌకర్యాలు కల్పించామని, భవనాల మరమ్మతులు, ఆర్వో ప్లాంట్లు, సీసీ కెమెరాలు వంటి మౌలిక వసతులను అభివృద్ధి చేశామని చెప్పారు. బీసీ విద్యార్థులకు సివిల్స్, గ్రూప్స్, డీఎస్సీ వంటి పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్ అందిస్తున్నామని, విశాఖపట్నం, అనంతపురం, తిరుపతిలో ప్రత్యేక బీసీ స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.ఆదరణ 3.0 పథకం కోసం రూ.1000 కోట్లు కేటాయించామని, ఆధునిక పరికరాల ద్వారా బీసీలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అమలుకు చర్యలు తీసుకుంటున్నామని, బీసీ రక్షణ చట్టానికి తుది రూపు ఇస్తున్నామని పేర్కొన్నారు.అన్ని జిల్లా కేంద్రాల్లో బీసీ భవనాలు నిర్మించనున్నట్లు వెల్లడించిన మంత్రి, గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కులాలు, ప్రాంతాల మధ్య విభేదాలు సృష్టించేందుకు ప్రతిపక్ష నాయకుడు జగన్ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

# రాయచోటికి ఎంజేపీ గురుకులం మంజూరు

**బీసీ విద్యార్థుల విద్యా ప్రగతికి మరో మైలురాయి**

**రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కృషి ఫలితం**

**హర్షం వ్యక్తం చేసిన పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న**



**రాయచోటి మన జనప్రగతి జూన్ 24:-** రాయచోటి ప్రాంత విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం మరో శుభవార్త అందించిందని, మహాత్మా జ్యోతిబా ఫూలే (ఎంజేపీ) గురుకుల పాఠశాల మంజూరు కావడం బీసీ విద్యార్థుల విద్యా భవిష్యత్తుకు గొప్ప వరమని పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న పేర్కొన్నారు. ఈ నిర్ణయం గ్రామీణ మరియు వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే రాష్ట్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితల దూరదృష్టితో పాటు రాయచోటి అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రత్యేక చొరవ ఫలితంగానే ఈ గురుకులం మంజూరైందని ఆయన తెలిపారు.ఎంజేపీ గురుకులం ద్వారా బీసీ విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్య, వసతి, ఆహారం, పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ వంటి సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల పేద విద్యార్థులు ఉన్నత విద్యా అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఈ గురుకులం ఒక బలమైన వేదికగా నిలవనుందని అన్నారు.రాయచోటి ప్రాంత విద్యాభివృద్ధికి ఇది ఒక చారిత్రాత్మక ముందడుగని, వేలాది మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపే నిర్ణయంగా నిలుస్తుందని అంకన్న అభిప్రాయపడ్డారు. బీసీ విద్యార్థుల విద్యా అభివృద్ధి, సామాజిక సాధికారత కోసం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలని కోరుతూ, గురుకులం మంజూరుకు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వం మరియు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను కలిసిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**- రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చ**



**అమరావతి మన జనప్రగతి జూన్ 24:-**రాష్ట్ర రవాణా, యువజన మరియు క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి బుధవారం అమరావతి సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవితను ఆమె చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఇరువురు మంత్రులు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలు, శాఖల పనితీరు తదితర అంశాలపై సౌహార్ద్రపూర్వక వాతావరణంలో చర్చించారు.ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరవేయడంపై కూడా అభిప్రాయాలు పంచుకున్నట్లు సమాచారం. ఈ భేటీ ఆత్మీయ వాతావరణంలో జరిగింది.

# బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను కలిసిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**- రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చ**



**అమరావతి మన జనప్రగతి జూన్ 24:-**రాష్ట్ర రవాణా,యువజన మరియు క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి బుధవారం అమరావతి సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవితను ఆమె చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఇరువురు మంత్రులు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలు, శాఖల పనితీరు తదితర అంశాలపై సౌహార్ద్రపూర్వక వాతావరణంలో చర్చించారు.ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరవేయడంపై కూడా అభిప్రాయాలు పంచుకున్నట్లు సమాచారం. ఈ భేటీ ఆత్మీయ వాతావరణంలో జరిగింది.

# వేంపల్లె పోస్ట్ ఆఫీస్‌లో ఆధార్ సెంటర్‌ని ఏర్పాటు చేయించండి



**వేంపల్లె మన జనప్రగతి జూన్ 24:** ఐదు మండలాలకు కూడలిగా ఉన్న వేంపల్లి పోస్ట్ ఆఫీస్ లో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేయించాలని వేంపల్లి జడ్పిటిసి సభ్యుడు మాచిరెడ్డి రవి కుమార్ రెడ్డి ప్రొద్దుటూరు పోస్టల్ సూపర్డెంట్ లక్ష్మన్నను కోరారు. ఈ మేరకు కత్తులూరు మాజీ సర్పంచి ఆర్ ఎల్ వి ప్రసాద్ రెడ్డి తో కలిసి ఆయన ప్రొద్దుటూరు కు వెళ్లి సూపర్డెంట్ వినతి పత్రం సమర్పించారు. వేంపల్లి లో అరవై వేల మంది జనాభా ఉన్నారని, చుట్టుపక్కల మండలాల వారు కూడా ప్రతి చిన్న విషయానికి వేంపల్లికి వస్తుంటారన్నారు. ఇక్కడ మూడు ఆధార్ నమోదు కేంద్రాలు ఉండగా అందులో ఒక సచివాలయంలోని యంత్రం పనిచేయకపోవడంతో, ప్రస్తుతం రెండు మాత్రమే పని చేస్తున్నాయన్నారు. ఈ కారణంగా ఆధార్ అప్డేట్ కోసం చిన్నపిల్లలు మొదలుకొని వృద్ధుల వరకు అందరూ సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని పోస్ట్ ఆఫీస్ లో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేయించాలని ఆయన కోరారు. ఈ విషయమై సత్వరం చర్యలు చేపడతామని సూపరిండెంట్ జడ్పిటిసి కి హామీ ఇచ్చారు.

# గడ్డి నిల్వలు బూడిద..రైతుకు దెబ్బ

- **అమ్మయ్యగారిపల్లెలో అగ్నిప్రమాదం**
- **లక్ష రూపాయల మేర నష్టం**



**వేముల మన జనప్రగతి జూన్ 24:** వేముల మండలంలోని అమ్మయ్యగారిపల్లె గ్రామంలో మంగళవారం గడ్డి వాము అగ్నికి ఆహుతైన ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చిట్టిబోయిన గంగన్నకు చెందిన గడ్డి వాము అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో పూర్తిగా దగ్ధమైంది.గడ్డి వాము నుంచి మంటలు ఎగసిపడటాన్ని గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అగ్నిమాపక వాహనంతో ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. దీంతో మంటలు సమీప ప్రాంతాలకు వ్యాపించకుండా నివారించగలిగారు.అయితే అప్పటికే గడ్డి వాము పూర్తిగా కాలిపోవడంతో రైతు గంగన్నకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ ఘటనలో సుమారు రూ.1 లక్ష మేర ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితుడు తెలిపారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు.

# పొలాలకు వెళ్లేందుకు దారులు ఇప్పించండి



**వేంపల్లె మన జనప్రగతి జూన్ 24:**మండలం లోని అల్లిరెడ్డిపల్లి గ్రామ పరిధి లోని సాగు భూములకు వెళ్లేందుకు దారులు లేక, సాగునీటి కాలువ ఆక్రమణకు గురై తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఈ సమస్యను సత్వరం పరిష్కరించాలని అల్రెడ్డిపల్లి గ్రామ రైతులు బుధవారం తహసిల్దార్ జల్లా శివ శంకర్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. గ్రామానికి చెందిన వేమిరెడ్డి బాలకృష్ణారెడ్డి పొట్టిపాటి మదన్ మోహన్ రెడ్డి నాగభూషణ్ రెడ్డి సుదర్శన్ రెడ్డి తదితరులు తహసిల్దార్ ను కలసి తమ గోడు వెల్లబోసుకున్నారు. గ్రామంలోని కాలువ కింద ఉన్న భూములను తమ పూర్వీకుల కాలం నుంచి సాగు చేసుకుంటున్నామని రైతులు తెలిపారు. గతంలో ప్రత్యేక రహదారి లేకపోయినా పరస్పర సహకారంతో పొలాలకు చేరుకునేవారమన్నారు. అయితే రోడ్డుకు ఇరువైపులా కొందరు రైతులు మామిడి తోటలు ఏర్పాటు చేయడంతో మధ్యలో ఉన్న భూములకు వెళ్లే మార్గం పూర్తిగా మూసుకుపోయిందని పేర్కొన్నారు. దీంతో సుమారు 60 ఎకరాల సాగు భూములకు రాక పోకలు నిలిచిపోయాయని వివరించారు.అదేవిధంగా సాగు నీటి కోసం ఉపయోగించే పెద్ద కాలువను కొందరు రైతులు పూడ్చివేసి సాగు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై గతంలో ఫిర్యాదు చేయగా రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి సరిహద్దులు గుర్తించారని తెలిపారు. ప్రస్తుతం కాలువ పునరుద్ధరణకు కొందరు రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు.కాలువ సరిహద్దులను తిరిగి సర్వే చేసి, సాగునీటి కాలువను పునరుద్ధరించడంతో పాటు తమ పొలాలకు శాశ్వత రహదారి ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. ఈ విషయమై చర్యలు చేపడతామని

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం

25 - 06 - 2026

# రెండు చుక్కలతో.. నిండు నూరేళ్ళ రక్ష



### జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశంలో.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

### పల్స్ పోలియోను ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా చేపట్టాలి

### జూన్ 28న బూత్ లెవెల్, 29, 30వ తేదీల్లో ఇంటింటికీ తిరుగుతూ పల్స్ పోలియో కార్యక్రమం

### జిల్లా వ్యాప్తంగా 2404 బూత్ లు సిద్ధం

**కడప మన జనప్రగతి జూన్ 24 :-** రెండు చుక్కలతో.. నిండు నూరేళ్ళ రక్ష అని.. పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో.. ఈ నెల 28వ తేదీన నేషనల్ ఇమ్యునైజేషన్ డే సందర్భంగా.. జిల్లాలో నిర్వహించే పల్స్ పోలియో ఏర్పాట్లపై సంబందిత అధికారులతో జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. టాస్క్ ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజల భాగస్వామ్యంతోనే పోలియో నిర్మూలన వంద శాతం సాధ్యం అవుతుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చర్యల ద్వారా.. దేశ వ్యాప్తంగానే కాకుండా.. జిల్లాలో కూడా పోలియోను పూర్తి స్థాయిలో నిర్మూలించగలిగామన్నారు. పోలియో వైరస్ ప్రభావం ప్రస్తుతం మన చుట్టూ లేకపోయినప్పటికీ.. ముందస్తుగా ప్రతి ఒక్కబిడ్డను పోలియో నుండి రక్షించుకోవడం మన బాధ్యత అన్నారు. "నిండు జీవితానికి రెండు చుక్కలు" అన్న నినాదాన్ని సమాజంలో విస్తృత పరచడంలో జిల్లా ప్రజారోగ్య శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, ఆశ, సచివాలయ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంపై విస్తృత ప్రచారం భాగంగా.. మీడియా కూడా తన వంతు బాధ్యత తీసుకోవాలని తెలియజేశారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఐదేళ్లలోపు వయస్సు గల 2,28,207 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి కార్యాచరణ సిద్ధం చేసినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 40 మండలాలు, 57 పల్స్ పోలియో ప్రణాళిక విభాగాల పరిధిలో మొత్తం 2,404 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వీటిలో 2,315 స్థిర కేంద్రాలు, 57 మొబైల్ కేంద్రాలు, 32 రవాణా కేంద్రాలు ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వహణ కోసం 9,438 మంది టీకా సిబ్బంది, 232 మంది పర్యవేక్షకులు, 232 వాహనాలను వినియోగిస్తున్నామని తెలిపారు.చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు అందేలా 4.20 లక్షల మోతాదుల పోలియో టీకాను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 197 డేంజర్ ప్రాంతాలను ప్రత్యేకంగా గుర్తించి, అక్కడ నివసిస్తున్న 1,425 మంది ఐదేళ్లలోపు చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు.గత విడతలో జిల్లాలో 100.03 శాతం లక్ష్య సాధన నమోదైందని, ఈసారి కూడా అదే స్థాయిలో విజయవంతం చేయడానికి వైద్య ఆరోగ్య శాఖ, అంగన్‌వాడీ, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని తల్లిదండ్రులు తమ పిల్లలను సమీప పోలియో కేంద్రాలకు తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.ప్రస్తుతం పోలియో మహమ్మారి ప్రభావం అంతగా లేనప్పటికీ.. కొన్ని ఊహించని సందర్భాల్లో వైరస్ సంక్రమణ జరిగే అవకాశం ఉన్నందున మనమందరం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఎంతైనా అవసరం అన్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బూత్ లతో పాటు మున్సిపాలిటీల్లోని వార్డుల్లో, గ్రామాల్లో, బస్టాండులు, రైల్వే స్టేషన్లు, ఎయిర్ పోర్టులు, వలస కూలీలు ఉన్న చోట, పబ్లిక్ అధికంగా ఉన్నచోట పోలియో చుక్కలు వేయడం జరుగుతోందన్నారు.జూన్ 28వ తేదీన మొబైల్ టీముల ద్వారా 29, 30వ తేదీల్లో ఇంటింటికీ వెళ్లి వ్యాక్సినేషన్ చేయడం జరుగుతుందన్నారు. మూడు రోజుల పాటు.. ఉదయం 7 గం.ల నుండి సాయంత్రం 5 గం.ల వరకు పల్స్ పోలియో ప్రక్రియ నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ మూడు రోజులను ప్రతిఒక్కరూ అత్యంత బాధ్యతగా తీసుకుని భవిష్యత్తు తరాలకు సంపూర్ణ ఆరోగ్యకర పౌరులను అందిద్దామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో కలిసి జాతీయ పోలియో గోడ పత్రికను విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్మునైజేషన్ అధికారి డా. రవిబాబు, ఐసీడీఎస్ పీడి రమాదేవి, ఆర్టీవో ప్రసాద్, రిమ్స్ సూపరింటెండెంట్ డా. వెంకటేశ్వర్లు, రైల్వే, ఆర్టీసీ, ఐఎంఏ సభ్యులు, సంబంధిత టాస్కోర్స్ కమిటీ సభ్యులు, సంబందిత శాఖల అధికారులు, ఎన్జీవోలు తదితరులు పాల్గొన్నారు.

## సీసీఐల నమోదు ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనల మేరకు చేపట్టాలి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



**కడప అర్బన్ మన జనప్రగతి జూన్ 24 :-** బాలల సంరక్షణ, రక్షణకు సంబంధించిన సంస్థలు తప్పనిసరిగా చట్టబద్ధంగా నమోదు చేసుకుని ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు సేవలు అందించాలని జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.బుధవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో.. జువెనైల్ జస్టిస్ (బాలల సంరక్షణ మరియు రక్షణ) చట్టం2015 కింద బాలల సంరక్షణ సంస్థల (సీసీఐలు) నమోదు కోసం ప్రభుత్వానికి సిఫార్సులు చేయుటకు.. జిల్లా.కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన జిల్లా స్థాయి సిఫార్సు కమిటీ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. సంరక్షణ మరియు రక్షణ అవసరమైన బాలలకు సురక్షితమైన ఆశ్రయం, విద్య, ఆరోగ్య సేవలు, సమగ్ర సంరక్షణ అందించడంలో బాలల సంరక్షణ సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. జువెనైల్ జస్టిస్ చట్టం2015లోని సెక్షన్41 ప్రకారం అన్ని బాలల సంరక్షణ సంస్థలు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు.ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో పనిచేస్తున్న బాలల సంరక్షణ సంస్థల అర్హతలు, మౌలిక సదుపాయాలు, నిర్వహణ ప్రమాణాలు, బాలల భద్రతా చర్యలను సమగ్రంగా పరిశీలించి ప్రభుత్వానికి సిఫార్సులు చేస్తున్నామని తెలిపారు. బాలల హక్కుల పరిరక్షణకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ ప్రతి సంస్థ నిబంధనలను కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందన్నారు.బాలల సంక్షేమం, భద్రత, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా సీసీఐల నమోదు ప్రక్రియను పారదర్శకంగా, బాధ్యతాయుతంగా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రొబేషన్ అధికారి రవిశంకర్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పులివెందుల అభివృద్ధిపై వైఎస్ కుటుంబం ప్రత్యేక ముద్ర

### అధికారంలో లేకున్నా రూ.కోట్ల నిధులతో పనుల జోరు

### యర్రగుడిపల్లెలో సీసీ రోడ్లను ప్రారంభించిన వైఎస్ జగన్



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూన్ 24:**అధికారంలో ఉన్నా,ప్రతిపక్షంలో ఉన్నా పులివెందుల ప్రాంత సమగ్ర అభివృద్ధి కోసం వైయస్ కుటుంబం ఎల్లప్పుడూ పరితపిస్తూనే ఉంటుందని మరోసారి నిరూపితమైంది.కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండేళ్లు పూర్తవుతున్నా,రాజకీయ వివక్షతో పులివెందుల పట్టణానికి ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించలేదు.ఈ నేపథ్యంలో ప్రజలు పడుతున్న తీవ్ర ఇబ్బందులను గమనించిన మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి మార్గదర్శకత్వంలో,కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి.వైసీపీ పార్లమెంట్ సభ్యుల నిధులు,మునిసిపల్ కౌన్సిల్ ప్రత్యేక తీర్మానాలతో నిధుల కొరత లేకుండా పులివెందుల పట్టణ రూపురేఖలను మారుస్తున్నారు.గత ఏడాది నిధులు లేక నిలిచిపోయిన ప్రధాన కాలనీల రోడ్లపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజల అభీష్టం మేరకు రూ.1.50 కోట్లతో స్థానిక త్రిలోక్ మార్ట్ నుండి శ్రీరాముని గుడి వరకు రూ. 50 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం,వైఎస్సార్ కాలనీ (31వ వార్డు) న్యాక్ బిల్డింగ్ పక్కన ఉన్న ప్రధాన మార్గానికి రూ.50 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం,యర్రగుడిపల్లి (14, 15వ వార్డులు) గరుడాల బ్రిడ్జి పక్కన రేషన్ డీలర్ షాప్ మరియు సీఎస్ఐ చర్చి ఎదురుగా ఉన్న రోడ్డు పునరుద్ధరణ,సీసీ రోడ్డు నిర్మాణం (రూ.50 లక్షల వ్యయం),2026లో రూ.110 లక్షలతో తలపెట్టిన కొత్త ప్రతిపాదనలు కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నిలిచిపోయిన పనులను పూర్తి చేసేందుకు గాను,ఈ ఏడాది (2026) మళ్లీ వైసీపీ ఎంపీ నిధుల నుండి దాదాపు రూ.1.10 కోట్లతో నూతన పనులకు శ్రీకారం చుట్టారు.దీనికి సంబంధించిన ప్రతిపాదనలను అధికారులు ఇప్పటికే సిద్ధం చేశారు.చిన్న రంగాపురం రూ.40 లక్షల అంచనా వ్యయంతో నూతన సీసీ రోడ్డు నిర్మాణం.పెద్ద రంగాపురం రూ.50 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం పనులు,వ్యర్థాల నిర్వహణకు ప్రత్యేక వాహనం,పులివెందుల పురపాలక సంఘం పరిధిలో నిధుల లేమి వల్ల చెత్త,వ్యర్థాల నిర్వహణ సరిగ్గా జరగడం లేదన్న ప్రజాభిప్రాయం మేరకు రూ.18 లక్షల వ్యయంతో కొత్త ట్రాక్టర్ కొనుగోలు,మునిసిపల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో మరో రూ.70 లక్షల పనులు ఇవే కాకుండా,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మెజారిటీతో ఉన్న పులివెందుల మునిసిపల్ కౌన్సిల్ పట్టణ ప్రగతికి మరో ముందడుగు వేసింది.15వ ఆర్థిక సంఘం నిధుల నుండి దాదాపు రూ.70 లక్షలతో రోటరీపురం,చెన్నారెడ్డి కాలనీ వంటి ప్రాంతాలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ మరియు రోడ్ల మరమ్మత్తుల కోసం ప్రణాళికలు సిద్ధం చేసింది.దీనికి కౌన్సిల్ ఆమోదం కూడా లభించడంతో త్వరలోనే ఈ పనులు ప్రారంభం కానున్నాయి.అధికార బలం లేకపోయినా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైయస్ జగన్ మోహన్ రెడ్డి, వైయస్ అవినాష్ రెడ్డి తమ మొక్కవోని సంకల్పంతో పులివెందులకు నిధులు సమకూరుస్తూ,ప్రాంతాన్ని ప్రగతి పథంలో నడిపిస్తుండటంపై స్థానిక ప్రజల నుండి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

## కంప్యూటర్ సాఫ్ట్ వేర్ కోర్సుల్లో ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ



**హైదరాబాద్ మన జనప్రగతి జూన్ 24:-** స్వర్ణ తెలంగాణ స్వయం ఉపాధి శిక్షణ పథకం ద్వారా 36వేల మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉచితంగా 100కు పైగా వివిధ కంప్యూటర్ సాఫ్ట్ వేర్ కోర్సుల్లో ఆన్ లైన్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఏ. వెంకట్ రెడ్డి తెలిపారు. ఆన్ లైన్ ఈ లెర్నింగ్ ద్వారా కోర్స్ పూర్తిచేసిన యువతకు కేంద్ర ప్రభుత్వం ఆమోదంచే నేషనల్ స్కిల్ అకాడమీ ద్వారా సర్టిఫికెట్ అందజేయడం జరుగుతుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆసక్తిగల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. నేటి సమాజంలో పేద, మధ్యతరగతి విద్యార్థిని విదార్థులకు, నిరుద్యోగ యువతీ యువకులకు అత్యధిక జీత భత్యాలు, ఉద్యోగ అవకాశాలు గల కంప్యూటర్ సాఫ్ట్వేర్ రంగంలో ఆన్లైన్ శిక్షణ అందించడం ద్వారా ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కంప్యూటర్ సాఫ్ట్వేర్ శిక్షణ రంగంలో 34 సంవత్సరాల అనుభవం గల పేస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సంస్థ నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రతి ఏటా లేటెస్ట్ కంప్యూటర్ సాఫ్ట్వేర్ కోర్సుల్లో ఆన్లైన్ లో శిక్షణను అందించనున్నట్లు తెలిపారు. ఈ పథకం క్రింద ఏఐ, డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి 100 కోర్సులు ఎలాంటి కోర్స్ ఫీజు లేకుండా ఆన్ లైన్ ఈ-లెర్నింగ్ ద్వారా శిక్షణను అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు విదేశాలలో అధిక వేతనాలతో ఉత్తమ ఉపాధి అవకాశాలు ఉంటాయని తెలిపారు. స్వర్ణ తెలంగాణ స్వయం ఉపాధి శిక్షణా పథకం ద్వారా రూ.1,50,000 వరకు కోర్స్ ఫీజులు గల వివిధ లేటెస్ట్ కంప్యూటర్ సాఫ్ట్వేర్ డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సులు ఎలాంటి కోర్స్ ఫీజు లేకుండా నేర్చుకొని సాఫ్ట్వేర్ రంగంలో ఉద్యోగాలు పొందాలని ఆయన సూచించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ విద్యార్థినీ విద్యార్థులు, నిరుద్యోగ యువతీ యువకులు జూలై 31వ తేదీ లోగా ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.దరఖాస్తు చేసుకునేందుకు వెబ్ సైట్: www.pace-computers.org వివరాలకు ఫోన్: 9505800047

## బీసీ విద్యార్థులకు వెన్నుదన్నుగా కూటమి ప్రభుత్వం

### బీసీ గురుకులాలు మంజూరు చేయడం పట్ల మంత్రికి కృతజ్ఞతలు

### టిడిపి బీసీ సంఘాల నేతలు జగన్నాథం, అక్కినపల్లి లక్ష్మయ్య




**తిరుపతి మన జనప్రగతి జూన్ 24 :-** రాష్ట్రంలోని బీసీ విద్యార్థులకు మొదటి నుంచి వెన్నుదన్నుగా నిలుస్తోంది ఒక్క తెలుగుదేశం ప్రభుత్వమేనని టిడిపి బీసీ సాధికార సమితి రాష్ట్ర నేత, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేలూరు జగన్నాథం చెప్పారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వేలూరు జగన్నాథంతో పాటు, రజక జనసేవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అక్కెనపల్లి లక్ష్మయ్య లు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి బీసీలు వెన్నెముకని, బీసీల సంక్షేమం అభివృద్ధి ఒక టిడిపి ప్రభుత్వం తోనే సాధ్యమైందని చెప్పారు. బీసీ విద్యార్థులు ఉన్నత విద్యను చదువుకోవాలన్న లక్ష్యముతో రాష్ట్ర ప్రభుత్వం 10 బిసి గురుకులాలను మంజూరు చేసిందని పేర్కొన్నారు. బిసి గురుకులాలు మంజూరు చేయడానికి విశేషంగా కృషిచేసిన రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మకు ఉమ్మడి జిల్లా బీసీ సంఘాల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీసీ గురుకులాల మంజూరుకు క్యాబినెట్లో నిర్ణయం తీసుకోవడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో 10 జ్యోతిరావు పూలే బీసీ గురుకులాలు ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలపడం వల్ల వేలాది మంది బీసీ విద్యార్థులు ఉన్నత విద్యార్థులుగా ఎదిగే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

6 గురుకుల పాఠశాలలను అప్గ్రేడ్ చేసిన ప్రభుత్వం, ప్రస్తుతం 10 గురుకులాల్లో ఒక్కొక్క దాంట్లో 37 మంది ఉద్యోగుల భర్తీకి కూడా మంత్రివర్గం ఆమోదం తెలపడం శుభపరిణామం అన్నారు. అనంతరం యాదవ సాధికార కమిటీ రాష్ట్ర సభ్యులు సత్తు మధుసూదన్ యాదవ్, సంచార జాతుల సంక్షేమ సంఘం అధ్యక్షులు రవి లు మాట్లాడుతూ నారా లోకేష్ విద్యార్థుల భవిష్యత్తు కోసం కొత్త కొత్త టెక్నాలజీని ప్రవేశపెడుతున్నారన్నారు. అధునాతన టెక్నాలజీని వినియోగించుకొని నేటి విద్యార్థులు రేపటి భారత భావి పౌరులుగా ఎదగాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. హై స్కూల్ ఇంటర్ డిగ్రీ లలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలన్నదే కూటమి ప్రభుత్వం యొక్క లక్ష్యమని, అందుకే నారా లోకేష్ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకొని విద్యాశాఖను పూర్తిగా ప్రక్షాళన చేసి నాణ్యమైన విద్యను విద్యార్థులకు చేరువ చేశారని చెప్పారు. ఈ సందర్భంగా 10 బీసీ గురుకులాలు మంజూరు చేయడం పట్ల స్వీట్లు పంచి పెట్టి సంబరాలు జరుపుకున్నారు. సమావేశంలో ఆముదాల తులసీదాస్, నాయి బ్రాహ్మణ సాధికార సమితి నేత అద్దంకి బాలరాజు, శ్రీనివాసులు, సురేష్ పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174